

## నేడు, రేపు పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగలు అయినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేస్తాయి. ఆర్థిక సంవత్సం ముగింపు రోజులు కావటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయిం తీసుకుంది. సాధారణంగా సెలవు దినాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తే రూ.5వేలు అదనంగా చెల్లించాలి. అయితే ప్రభుత్వమే సెలవు లేదని ప్రకటించటంతో ఆ అదనపు రుసుము చెల్లించకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చు.

# కొత్త కొత్త ఆశలతో..

**శ్రీవిశ్వావసు నామ సంవత్సరం నేడు ఆరంభం ● గ్రామదేవతలకు పూజలు, ఉత్సవాలు**



నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉగాది.. తెలుగు వారికే ప్రత్యేకమైన, ప్రీతిపాత్రమైన పండుగ. కొత్త ఏడాదికి ఆరంభ దినం. ఆకురాలే శిశిరం పోయి కొత్త చిగుళ్ల, కోటి ఆశల వసంతానికి స్వాగతం పలికేరోజు. ఇక ఏడాదంతా గుర్తుండిపోయే షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. క్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ శ్రీవిశ్వావసు నామ సంవత్సరాన్ని ఘనంగా ఆహ్వానించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. క్రోధినామ సంవత్సరంలో ప్రజలు అనేక ఇబ్బందులు, ఈతిబాధలు, అధిక ధరలతో సతమతమయ్యారు. ఆ చేదు జ్ఞాపకాలను మరిచిపోయి కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలని కోరుకుంటూ తమ ఇష్టదైవాలకు విశేష పూజలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మహాలక్ష్మి, పార్వతి, సరస్వతి, విష్ణు, మహేశ్వర, బ్రహ్మాది దేవతలకు విశేష పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే ఏడాది పొడవునా పిల్లాపాపలు, గొడ్డుగోద పాడిపంటలతో చల్లగా కాపాడాలని కోరుతూ గ్రామ దేవతలకు విశేష పూజలు, నగరోత్సవాలు జరపనున్నారు.

**● ఉగాది పచ్చడి ప్రాముఖ్యత**

ఉగాది పండుగకు కేంద్ర బిందువు ఉగాది పచ్చడి. ఇందులో పుల్లని చింతపండు, తీపి బెల్లం, ఉప్పు, కారంగా ఉండే కారం, చేదు వేప చిగుళ్ల పూత, మామిడి పిందెలతో పచ్చడి చేస్తారు. ఉగాది రోజు ఈ పచ్చడి సేవిస్తే ఆరోగ్యం వృద్ధితోపాటు జీవితంలో ఈ ఏడాదిలో ఎదురయ్యే అన్ని సమస్యలను ఎదురయ్యే సమస్యలు ఉగాది పచ్చడిలా ఉంటాయని ప్రజలకు సంకేతంగా ఉంటుంది.

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం రేవతి నక్షత్రంతో ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరంలో సంపద సమృద్ధిగా ఉంటుంది. ప్రజలు సంతోషంగా ఉంటారని పంచాంగం, జ్యోతిష్యం చెబుతోంది. చేసే పనులు, ప్రయత్నాలకు బలం చేకూరుతుంది. అయితే విజయం సాధించాలి అంటే తెలివితేటలు ప్రదర్శించాల్సిందే. రైతులకు కొంత పంట ఇబ్బంది అయినా గిట్టుబాటు ధర లభిస్తుంది.

**షడ్రుచులు కలగలసిన పచ్చడి రుచి చూడటం.. భవిష్యత్తుపై కొంగ్రొత్త ఆశలతో పంచాంగాన్ని వినడం.. తెలుగుదనం ఉట్టిపడేలా కవితాగానాన్ని ఆలపించడం.. ఇవీ ఉగాది నాడు ఆవిష్కృతమయ్యే దృశ్యాలు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో తమకంతా శుభం కలగాలంటూ వచ్చే భక్తుల కోసం దేవాలయాలు ముస్తాబయ్యాయి.**



విద్యుద్దీప వెలుగుల్లో ఇరగాళమ్మ ఆలయం

**శుభఘడియలు**

ఉగాది సందర్భంగా ఆదివారం నాడు శుభ ఘడియలు, చేయవలసిన కార్యక్రమాలు పంచాంగకర్తలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 నుంచి 7.30లోపు, తిరిగి ఉదయం 9 నుంచి 11.30 గంటల లోపు నూతన వస్త్రధారణ, నూతన యజ్ఞోపవేతం ధారణలతోపాటు ఉగాది పచ్చడి సేవించాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 3గంటలలోపల బెల్లం, చింతపండు, బంగారం, వెండి వస్తువులను కొనుగోలు చేయుట శుభకరం. సాయంత్రం 3 నుంచి 4.15 లోపు తిరిగి 6 నుంచి 7గంటలలోపు తూర్పు, ఉత్తర దశల్లో ప్రయాణం చేయాలి. ఉదయం 9.28, లేదా 9 నుంచి 11.30 గంటల లోపు నూతన అకౌంట్ బుక్ ప్రారంభిస్తే వ్యాపారాల్లో మంచి లాభాలు వస్తాయని తెలిపారు.

ఈ సంవత్సరం వర్షాలు ఆశించినస్థాయిలో కురుస్తాయి. అయితే కొత్త వ్యాధులు వ్యాప్తి చెంది అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. పండితులు, గురువులను సంప్రదించి ముహూర్తాలు నిర్ణయించుకుని పనిచేస్తే విజయవంతం అవుతాయి. ఆదివారం ఉగాది సందర్భంగా జిల్లావ్యాప్తంగా గ్రామదేవతలు, అమ్మవారి ఆలయాల్లో విశేష అభిషేకాలు, అలంకారం, పంచాంగ శ్రవణాలు, వాహన సేవలు భారీగా జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దేవదాయ శాఖ పరిధిలో జిల్లాస్థాయిలో నలుగురు అర్చకులు, వేదపండితులను రూ.10 వేలు నగదు పారితోషకం, పట్టువస్త్రాలను సన్మానించనున్నారు. అలాగే ప్రతి ఆలయంలో అర్చకులు సన్మానాలు, పంచాంగ శ్రవణాలు నిర్వహిస్తున్నారు.



ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్

**● వేడుకలకు ఆహ్వానం**

ఉగాది వేడుకలకు తరలిరావాలని జిల్లా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు, కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9గంటలకు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నాదస్వరం, స్వాగత నృత్యం, పంచాంగ పఠనం, కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాలు జరుగుతాయని తెలిపారు. అధికారులంతా సంప్రదాయ వస్త్రాలు ధరించి రావాలని కోరారు.

**● 8 మందికి పురస్కారాలు**

ఉగాది పర్వదినం సందర్భంగా జిల్లాకు చెందిన 8 మందికి పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం అందజేయనుంది. వి.మాధవరావు (మ్యాజిక్), దోర్నాల హరిబాబు (టీవీ, సినీ నటుడు), దానం అంకయ్య (జానపదం), ఈతకోట సుబ్బారావు (సాహిత్యం), టేకుమళ్ల వెంకటప్పయ్య (సాహిత్యం), ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ (సాహిత్యం, డైరెక్టర్ ప్రాచీన తెలుగు విజ్ఞాన కేంద్రం, ఓజిలి మునికుమారి (సంగీతం) మండలి రఘురామ్ (సామాజికసేవ) ఉన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా వీరు ఉగాది పురస్కారం అందుకోనున్నారు.



పూజాసామగ్రి కొనుగోలు చేస్తున్న నగరవాసులు



# తమ్ముళ్ల సంబరం

**● ఊరూరా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ● జిల్లావ్యాప్తంగా రెపరెపలాడిన పసుపుజెండా**



ఆత్మకూరులో నాయకులతో కలిసి పాల్గొన్న మంత్రి ఆనం

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు టీడీపీ జెండాలను ఎగరవేశారు. బాణాసంచా పేలుళ్ల నడుమ కేకులు కట్ చేయించి, అందరికీ పంచిపెట్టారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

● నెల్లూరు (వైద్యం) : రాజకీయాలలో సంచలనాత్మక మార్పులు తీసుకువచ్చింది దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావేనని రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత, మహిళలు, రైతులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులను ప్రోత్సహించి సామాన్యులను సైతం రాజకీయాల్లోకి ఆహ్వానించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ జాతీయ కార్యదర్శి మంత్రి లోకేష్ నాయకత్వంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా నేతలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, టీడీపీ నేతలు చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, అనూరాధ, ధర్మవరం సుబ్బారావ్, రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : టీడీపీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న అజీజ్, పక్కన మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు



ఉదయగిరిలో 43 కిలోల కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సురేష్

● ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల డ్రామాతో రాజధాని లేకుండా రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరులో మంత్రి ఆనం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అంతకముందు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ తెలుగువారి ఆత్మ గౌరవం నిలిపేందుకు, పేదరిక వ్యవస్థ నిర్మూలన కోసం నాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని గుర్తు చేశారు. 1983లో ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పుడు తాను ఆత్మకూరులో టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచానని, 43 ఏళ్ల తర్వాత ఇదే నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం గర్వకారణంగా ఉందన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజా మద్దతుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి గొప్ప రాజధానిగా అడుగులు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇటీవల మృతిచెందిన న్యాయవాది చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి

## కష్టపడితేనే ఉన్నత శిఖరాలకు

**● యువ న్యాయవాదులకు హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి పిలుపు**

నెల్లూరు (లీగల్, ఆంధ్రజ్యోతి) : న్యాయవాది కష్ట పడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి కె. శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం రాత్రి జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన నెల్లూరు బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టిన న్యాయవాది ఓ స్వాప్నికుడిలా కలలు కనాలి.. అలా కన్న కలలను సాకారం చేసుకోవా లంటే నిరంతరం పుస్తక పఠనం, కఠోర శ్రమ చేస్తే జీవితంలో పైకి ఎదుగుతారని అని అన్నారు. న్యాయవాద వృత్తిలోకి రాగానే సరిపోదని, సీనియర్ న్యాయవాదులు కేసులు చేసేటప్పుడు వారు ఎలా చేస్తున్నారు.. కక్షిదారులతో వారు ఎలా మాట్లాడుతున్నారనేది కూడా పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా యువ న్యాయవాదులు సీనియర్ల దగ్గర తగిన శిక్షణ పొంది వృత్తిలో మెలకు వలను నేర్చుకోవాలన్నారు. న్యాయవాద వృత్తి నిరంతర ప్రక్రియ అని, న్యాయవాది నిత్య విద్యార్థిగా అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన తన గురువు వద్ద వృత్తికి సంబంధించి నేర్చుకున్న మెలకువలను గుర్తు చేసుకున్నారు. అలాగే న్యాయవాదులు తాము చేస్తున్న వృత్తికి న్యాయం చేయాలి, తనను నమ్మి వచ్చిన కక్షిదారుడికి నిబద్ధతతో కూడిన విలువలు కలిగిన విధంగా కేసులను వాదించాలని న్యాయవాదులకు ఉద్బోదించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి. యామిని మాట్లాడుతూ కేసులు త్వరి తగతిన పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించా లని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు పి.ఉమా మహేశ్వరరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులను హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి సత్కరించారు. అలాగే ఇటీవల మృతి చెందిన న్యాయవాదుల చిత్రపటాలను ఆవిష్కరించారు. అనంతరం హైకోర్టు జడ్జి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ నేతలు వర ప్రసాద్, స్వర్ణా ప్రసాద్, నావూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు మున్సిపల్ వార్షిక బడ్జెట్ రూ.30.36 కోట్లు

ఆత్మకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పురపాలక సంఘం వార్షిక బడ్జెట్‌ను రూ.30.36 కోట్లతో కౌన్సిల్ సభ్యులు ఆమెదించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ అక్ష్యతన జరిగిన బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. ప్రారంభ నిల్వ రూ.8.3 కోట్లు, పన్నుల వసూలు రూ.3.43 కోట్లు, ఇతర ఆదాయం రూ.7.33 కోట్లు, వినోదపు పన్ను రూ.50వేలు, సర్‌చార్జి స్టాంపు డ్యూటీ రూ.1.8 కోట్లు, గవర్నమెంటు గ్రాంట్స్ రూ 12.3 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను తయారు చేశారు. నిల్వ రూ. 2.8 కోట్లుగా చూపించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఆత్మకూరులో ప్రతి మూడు నెలలకోసారి అభివృద్ధి పనుల జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో పావని, కమిషనర్ గంగా ప్రసాద్ వైస్‌చైర్మన్ సర్దార్, శ్రావణ్‌కుమార్, ఎక్స్‌అఫిషియో సభ్యులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం పీఎంఅజయ్, ఉన్నతి పథకాల ద్వారా పొదుపు సంఘాల మహిళలు 15 మందికి రూ.23.4 లక్షల చెక్కులను మంత్రి ఆనం అందచేశారు.

# ఆవిరైన ఆనందం!

**● మనవడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి వస్తుండగా ప్రమాదం**
**● హైవేపై కారును ఢీకొన్న బొలెరో వాహనం**
**● అమ్మమ్మ, పెద్ద మనవడి మృతి**
**● మరో నలుగురికి తీవ్రగాయాలు**



జాతీయ రహదారిపై ఢీకొన్న వాహనాలు





బట్టే కొండమ్మ, వీరబ్రహ్మం మృతదేహాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : బంధుమిత్రులతో ఎంతో ఆనందంగా మనవడి తొలి పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్న ఆనందం ఆ కుటుంబంలో ఎంతోసేపు నిలవలేదు. స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో బొలెరో వాహన రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరిని పొట్టన పెట్టుకుంది. కారును ఓ బొలెరో వాహనం ఢీకొనడంతో వృద్ధురాలి సహా, పెద్ద మనవడు మృతి చెందారు. శనివారం ఉదయం వరికుంటపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో హైవేపై జరిగిన ఈ ప్రమాదం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది.

ప్రకాశం జిల్లా పెద చెర్లోపల్లి మండలం పెద బొట్టుపల్లికి చెందిన బొట్టే కొండమ్మ రెండో కుమార్తె కలువాయి మండలం చీపినాపి గ్రామంలో ఉంటోంది. ఈమెకు కలిగిన మగ బిడ్డ తొలి పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం రాత్రి చీపినాపిలో జరగ్గా, కొండమ్మ ఇతర బంధువులు పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున కొండమ్మ సహా బంధువులంతా కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని వరికుంటపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలో హైవేపై సత్యసాయి జిల్లా కదిరి నుంచి బత్తాయి, పూల లోడుతో విజయవాడకు వెళ్లిన బొలెరో వాహనం తిరుగు ప్రయాణంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. వేగంగా పరుగులు తీస్తున్న బొలెరో యాక్సిల్ విరిగిపోవడంతో అదుపుతప్పి కారు మీదకు దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108, ఇతర వాహనాల్లో హుటాహుటినా ఉదయగిరి, ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలలకు తరలించారు. ఉదయగిరి మండలం దాసరపల్లి వద్ద బట్టే కొండమ్మ (50) మృతి చెందింది. పామూరులో చికిత్స పొందుతున్న పెద్ద కుమార్తె కుమారుడు బోనం వీరబ్రహ్మం (19) మృతి చెందాడు. మిగిలిన మరో నలుగురు వైద్యశాలల్లోనే చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంలో వాహనాల ముందు భాగం దెబ్బతిని వాటిల్లోని సామగ్రి రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్ఐ రఘునాథ్ ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గురైన వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అలాగే ప్రమాదానికి కారణమైన బొలెరో వాహన డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

### పక్కాగృహాల లబ్ధిదారులకు అదనపు సాయం విడుదల

కలువాయి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎస్టీ, ఎస్సీ, బీసీ పక్కా గృహాల లబ్ధిదారులకు తొలి విడత అదనపు సాయం రూ.15.20లక్షలు విడుదలైనట్లు మండల హౌసింగ్ ఏఈ అక్మల్ శనివారం తెలిపారు. మొదటగా పీఎంఏవై బీఎల్‌సీ (అర్బన్) కార్యక్రమం కింద ఇళ్లు మంజూరై పురోగతిలో ఉన్న లబ్ధిదారులకు వారి బ్యాంక్ ఖాతాలో ఈ నగదును ప్రభుత్వం జమ చేసినట్లు చెప్పారు. అదనపు సాయం పొందిన లబ్ధిదారులందరూ త్వరగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ఆయన కోరారు.

**బంగారం, వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ.8611 |
| వెండి కిలో ధర | రూ. 1,03,200 |
| వెండి ఒక గ్రాము | రూ.106.20 |

# టీడీపీ స్థాపనతోనే తెలుగుజాతికి గుర్తింపు : ఎమ్మెల్యే కాకర్ల


దుత్తలూరులో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్


సంగంలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు


కలువాయిలో కేకు కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ స్థాపనతోనే తెలుగుజాతికి గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీమణి ప్రవీణ, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ పొన్నెబోయిన చెంచల బాబుయాదవ్, టీడీపీ నాయకులతో కలిసి 43 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీడీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికి దిక్సూచిగా మారాయన్నారు. ఉదయగిరి దుర్గం, సిద్దేశ్వరం, కృష్ణమందిరం, వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా తొలివిడతగా రూ.కోటి నిధులతో ఉదయగిరి దుర్గంపైకి రహదారి మంజూరు కావడం శుభపరిణామ మన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, కిరణ్, సందానీ, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● దుత్తలూరు: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, టీడీపీ నాయకులు శ్రీకుర్తి రవీంద్రబాబు, చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సతీమణి ప్రవీణతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే బలమని, వారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ అండగా ఉంటున్నారన్నారు. తాను సైతం కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కాకర్ల దంపతులను ఘనంగా సన్మానించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు ఎన్టీఆర్, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి దంపతులు, మండల కన్వీనర్ చంద్ర మధుసూనరావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఆవుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆవిష్కరించారు. నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గొంగ్రటగు జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు డేగ మధుయాదవ్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కనకం సుదర్శన్‌రెడ్డి, గూడా నర్సారెడ్డి, మంచాల శ్రీనివాసులునాయుడు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

● సంగం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సంగంలో మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. వెంగారెడ్డిపాళెంలో సర్పంచు ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, కాకు మధుసూధనరావు, గునుపూడి గిరి, శ్రీనివాసులు చౌదరి, నియోజకవర్గ మహిళా నాయకులు మంజుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● కలువాయి : మండలంలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండులో టీడీపీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా విజయకుమార్‌రెడ్డి, చల్లా శివారెడ్డి, ఎన్ నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతసాగరం మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, అనంతసాగరం, చిలకలమర్రి, వెంగమనాయుడుపల్లి గ్రామాల్లో శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్స వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి, పాతపాటి మధుసుదన్‌రెడ్డి, మురారిశెట్టి మస్తానయ్య, రాపూరు జనార్ధన్‌రెడ్డి, చంద్రా రాజయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి ): మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల మాజీ కన్వీనర్ చెన్నకేశవులు, మండల క్లస్టర్ ఇంచార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జిల్లా ఎస్సీ కార్యనిర్వాహక ఆధికార ప్రతినిధి జామవా, జిల్లా బీసీ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జిలా_తెలుగు యువత నాయకుడు సింగాల నాగేశ్వరరావు, వీకాష్‌బాబు, దేవర వెంకటేశ్వర్లు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

● మర్రిపాడు : మండల కేంద్రంలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్ నాయుడు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్ష్మీనరసయ్య, ఎలగాల వెంకటేశ్వర్లు, చంద్రబాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


అనంతసాగరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


సీతారామపురంలో కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న నాయకులు

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం: మంత్రి ఆనం


రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డికి వెంకటేశ్వరస్వామి పటాన్ని అందచేస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఆత్మకూరు మండలంలోని మహిమలూరులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, దేశ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గుం డ్రా సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని సతీష్‌రెడ్డికి అందచేశారు. అనంతరం వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలోనే జిల్లాలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఒక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వాహనాన్ని ఏర్పాటుచేసి జిల్లావాసులందరికీ ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే స్విమ్స్ వారితో మాట్లాడి ఆత్మకూరు టౌన్‌లో మొబైల్ క్యాన్సర్ పరీక్షల వాహనాన్ని అందుబాటులో ఉంచి సమీప గ్రామాల ప్రజలందరికీ ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేయించేందుకు కృషిచేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అందరికీ అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ వైద్యశిబిరంలో 30 మంది అపోలో వైద్యులు, సిబ్బంది వైద్యసేవలు అందచేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, ఆర్డీవో పావని, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### సిమెంట్ రోడ్డు ప్రారంభం

కోటపాడు గ్రామంలో ఇటీవల రూ. 74 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖరరావు, జడ్పీటీసీ లక్ష్మీ ప్రసన్న, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

### విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

సంగం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఆత్మకూరు నుంచి నెల్లూరు వెళ్తూ మార్గమధ్యంలో సంగం జాతీయ రహదారి కూడలిలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు కాలనీ మహిళలు తమ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరడంతో స్పందించిన ఆయన ఐసీడీఎస్ పీడీని పంపి పరిశీలన అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వేణుగోపాల్, సంగం, ఆత్మకూరు సీఐలు, ఎస్ఐలు వేమారెడ్డి, గంగాధర్, రాజేష్, నాయకులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు అందజేస్తున్న కొట్టే వెంకటేశ్వర్లు

ఉదయగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శకునాలపల్లిలో మహిళలకు శనివారం జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు కల్లూరి సురేంద్రరెడ్డిలు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అల్లూరి రవీంద్ర, పెట్లు కిరణ్‌కుమార్, సరితా, కారంపూడి కేశవులు, వెంకటరమణయ్య, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): మండలంలోని గువ్వాడిలో శనివారం జనసేన ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు యాదగిరి ప్రభాకర్, యాదగిరి సురేష్, జగదీష్, రమేష్, కాకుమాని ప్రసాద్, చెన్న కేశవులు, వల్లభశెట్టి నారాయణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

ఉదయగిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొనేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శనివారం పట్టణంలోని నాగులబావి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించడంతోపాటు మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

## ఐటీఐకి ప్రతిపాదించిన భవనాల పరిశీలన

సంగం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సంగం సమీపంలో అమరపునాయుడు కండ్రికలో ప్రభుత్వ ఐటీఐకి ప్రతిపాదించిన ల్యాంకో ఫౌండేషన్ వృద్ధాశ్రమ భవనాలను శనివారం స్థానిక అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. సంగంలోని ప్రభుత్వ ఐటీఐకి స్వంత భవన వసతి లేక ప్రస్తుతం ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న విషయం విదితమే. అయితే అమరపునాయుడు కండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమం కోసం నిర్మించిన భవనాలు ఖాళీగా ఉండడంతో ప్రభుత్వ ఐటీఐకి ఉచితంగా ఇచ్చేందుకు ల్యాంకో ఫౌండేషన్ నిర్వాహకులు అంగీకరించారు. దీంతో దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆ భవనాలు ఐటీఐ కళాశాలకు ఉపయోగపడతాయో.. లేదో నని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. బిల్డింగ్ మ్యాప్‌లను పరిశీలించారు. ల్యాంకో ఫౌండేషన్ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దారు సోమ్లా నాయక్, రెవెన్యూ సిబ్బంది, ఇంజనీరింగ్, మండల సర్వేయర్, ల్యాంకో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### మామిడిలో తెగుళ్ల నివారణపై అవగహన

ఏఎస్ పేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చిరమన గ్రామంలో శనివారం ఉద్యావన శాఖ ఆధ్వర్యంలో మామిడి సాగులో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి పి లక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### సోమశిలలో 53.510 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 53.510 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 330, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



C.R.I.M.E N.E.W.S

## తండ్రి మందలించాడని తనయుడి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న రామశివశరణ్

నెల్లూరు(క్రైం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): చదువులో శ్రద్ధ చూపడం లేదని తండ్రి మందలించడంతో తనయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ముగ్గురాళ్లవీధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముగ్గురాళ్లవీధిలో నివాసం ఉంటున్న శంకర్ వరప్రసాద్, ఉషారాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రామశివశరణ్ (18) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశాడు. ఇంట్లో ఉంటూ చదువుపై శ్రద్ధ చూపడం లేదని తండ్రి మందలించేవాడు. ఈ క్రమంలో వరప్రసాద్ సరస్వతి నగర్‌లో నూతన నిర్మించిన ఇంటి వద్దకు శనివారం అందరూ కలిసి వెళ్లారు. అక్కడి నుంచి కుమారుడు రామశివశరణ్ గ్యాస్ సిలిండర్ తీసుకువచ్చేందుకు పాత ఇంటికి వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫోన్ చేశాడు. తీయకపోవడంతో ఆయన ఇంటికి వెళ్లి చూడగా కుమారుడు హాల్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. వరప్రసాద్ బోరున గుండెలు బాదుకుంటూ స్థానికుల సహకారంతో కుమారుడిని కిందకు దించి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించారు.

## రైలు కిందపడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): వందేభారత్ రైలు కిందపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం నెల్లూరు నగరంలోని హౌసింగ్‌బోర్డు వద్ద రైల్వే పట్టాలపై జరిగింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా గుర్తుతెలియని స్థితిలో ఉంది. మృతదేహానికి సమీపంలో లభ్యమైన ఆధార్‌కార్డు ఆధారంగా పోలీసులు విచారించారు. మృతుడు మనుబోలుకు చెందిన సాయికృష్ణ(31)గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో వివాహిత..


మృతురాలు ఆదిలక్ష్మి

తోటపల్లిగూడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన అక్కయ్యగారి ఆదిలక్ష్మి (34) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందా రు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఉదయం 7గంటల సమయంలో తన భర్త యాదగిరితో కలిసి వారి రొయ్యలగుంట వద్ద వెళ్లింది. ఈ సమయంలో పశువులకు మేత వేస్తుండగా గట్టు మీద ఉన్న కరెంటు వైరు రెండు కాళ్లకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ మేరకు ఆమె భర్త యాదగిరి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వీరేంద్రబాబు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


ఉదయగిరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అడవి పందిని ఢీకొని మోటార్‌బైక్ బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన దుత్తలూరు సెంటర్ సమీపంలో శనివారం చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన సునీత, కుమారుడు వెంకటరాంచరణ్, తండ్రి బద్దిక సుబ్బరాయుడుతో కలిసి వింజమూరు మండలం మోటచింతలపాళెంకు మోటార్‌బైక్‌పై వెళుతున్నారు. ఈక్రమంలో దుత్తలూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా అడవిపంది రావడంతో దానిని ఢీకొని కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించడంతో వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కావలికి తరలివెళ్లారు.

## మూడు లారీల ఢీ

● తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన లారీలు

కోవూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం మూడు లారీలు ఢీకొన్నాయి. మొదట రెండు లారీలు నెల్లూరు నుంచి కావలి వైపు వెళుతున్నాయి. అతివేగంతో వాహనాన్ని క్రాస్ చేసే సమయంలో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు తగలకపోవడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సమ యంలోనే చిత్తూరు నుంచి శ్రీకాకుళం వెళుతున్న మరో లారీ డ్రైవర్ ఈ ప్రమాదాన్ని గుర్తించక ఈ వాహనాలను వచ్చి ఢీకొన్నాడు. లారీలో ఉన్న రూ.1కోటి మద్యం సరుకులో ఒక్క బాటిల్ కూడా కింద పడకపోవడం విశేషం. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవరుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 130 |
| స్కిన్ చికెన్ | 234 |
| స్కిన్‌లెస్ | 260 |

కోడిగుడ్ల ధర (100): 445

## మత్స్యకారుల అభివృద్ధికి చంద్రబాబు కృషి

బిట్రగుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే లక్ష్యంగా రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషి చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకటక్రిష్ణా రెడ్డి తెలిపారు. జువ్వలదిన్నెలోని ఫిషింగ్ హార్బర్ వద్ద శనివారం సాయంత్రం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద లబ్ధిదారులకు మరబోటు పంపిణీ చేశారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తో కలిసి దగుమాటి మరబోటును నడిపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిషరీష్ జేడీ నాగేశ్వరావు, ఏడీ శ్రీనివాసులు, నాగేశ్వరావు, చినగోవిందు, శీనయ్య, మత్స్యకార కాపులు ఉన్నారు.

## కళాశాల వార్షికోత్సవం

బిట్రగుంట : కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టీయూ కాలేజ్ ఆఫ్ పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్దన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి, కరస్పాండెంట్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### రైతుల భూముల రీసర్వే

లింగసముద్రం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఆర్ కోట గ్రామంలోని రైతులు, ఆ గ్రామ పరిసర ప్రాంతాలకు చెంది రీసర్వే చేయించుకోని రైతులు ఏప్రిల్ 3వ తేదీ లోపు భూములకు సంబంధించిన పత్రాలు గ్రామ సచివాలయంలో ఇవ్వాలని తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్రాలు అందించిన రైతుల భూములను రీసర్వే చేయిస్తామని చెప్పారు. ఈమేరకు వీఆర్ కోట గ్రామంలో దండోరా కూడా వేయించినట్టు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### ప్రొఫెసర్ శైలజకు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ శైలజ

కావలి టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విక్రమసింహపురి విశ్వవిద్యాలయం కావలి పీజీ కళాశాలలో జంతుశాస్త్ర సహ అచార్యులు డాక్టర్ శైలజకు ఔట్‌స్టాండింగ్ ఎడ్యుకేటర్, సైంటిస్ట్ అవార్డు దక్కింది. తమిళనాడు కొయంబత్తూరులో నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎంటర్‌ప్రినియర్‌షిప్ డెవలప్‌మెంట్ నిర్వాహకులు శైలజకు అవార్డును ప్రదానం చేయగా శనివారం పీజీ కళాశాలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరారెడ్డి శైలజకు అవార్డును అందించి అభినందించారు.

### బుడంగుంటలో రక్తదాన శిబిరం

కావలి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు పలక నందకుమార్‌రెడ్డి, పులిమి మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో పట్టణంలోని బుడంగుంటలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 16మంది రక్తదానం చేయగా వారిని రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ హరినారప రెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూధన రావులు సత్కరించారు. అనంతరం గిరిజనులకు చీర, దుప్పటి, తువ్వాలు, లుంగీలతో కూడిన దుస్తుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ హరి నారపరెడ్డి, జీ. రామారావు, సాయికుమార్, రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### శ్రీవారి పదహారోజుల పండుగ

బిట్రగుంట : తాళ్లూరు విశ్వనాథరావు పేట అటవీ ప్రాంతంలోని పురాతన శ్రీవారి నిజపాదాల వద్ద స్వామిఅమ్మవార్ల పదహారోజుల పండుగ శనివారం వైభవంగా జరిగింది. కొండబిట్రగుంటలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం తరువాత 16 రోజులకు పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా స్థానిక మహిళల కోలాట భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహం దాతల సహకారంతో అన్నసంతర్పణ చేపట్టారు.

### కార్యదర్శి తప్పుడు లెక్కలకు అవధుల్లేవ్!

బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యదర్శి జహీర్ తప్పుడు లెక్కలకు అవధులు లేవని వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాచార హక్కు చట్టం కింద సేకరించిన పంచాయతీ ఖర్చుల చిట్టాను విప్పారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు ఉన్నారు.

# తెలుగువారి పార్టీ తెలుగుదేశం

కావలి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పట్టణంలోని మునునూరు టీడీపీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాగుంటపార్వతమ్మ ట్రంకురోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ స్థాపించిన 9నెలల్లోనే అధికారం చేపట్టి దేశవ్యాప్తంగా తెలుగు వారి ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం పార్టీని స్థాపించి ఆయావర్గాలకు రాజకీయ ప్రవేశం కల్పించిన నేత ఎన్టీఆర్ అన్నారు. పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాడన్నారు. ఎన్టీఆర్ బాటలో నారా చంద్రబాబు నాయుడు టీడీపీ ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ రాష్ట్రా భివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే యువనాయకుడు నారా లోకేష్‌ను ముఖ్యమంత్రిగాచూసే వరకు టీడీపీ కార్యకర్తలందరూ అలుపెరగని పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, పోట్లూరు శ్రీనివాసులు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, మొగిలి కల్లయ్య, తటవర్తి రమేష్, వాసు, యేగూరు చంద్రశేఖర్, దావులూరి దేవ పాల్గొన్నారు.

● జలదంకి (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ వంటేరు జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బ్రాహ్మణక్రాకలో వేడుకలు జరిగాయి. అలాగే జయచంద్రారెడ్డి గ్రామంలోని పంచాయతీ కార్యాలయ కూడలిలోని పార్టీ స్థూపం వద్ద జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా గ్రామకమిటీ అధ్యక్షుడు అక్కల శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కొండాపురం (ఆంధ్రజ్యోతి): గానుగపెంట పంచాయతీలోని ఆదిమూర్తిపురం, సాయిపేటలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలకేంద్రంతో పాటు, భీమవరప్పాడు, సత్యవోలు, చింతలదీవి, తూర్పుపాలెం, పార్లపల్లి, గరిమెనపెంట, కొమ్మి, తూర్పుఎర్రబల్లి, ఉప్పలూరు, గొట్టిగుండాల గ్రామాల్లో కేకులు కట్ చేసి స్థానికులకు పంచారు. కార్యక్రమాలలో నాయకులు పీ.చంద్రబాబునాయుడు, దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, కుంకు మోహనరావు, జాగర్లమూడి శ్రీను, మామిళ్లపల్లి వెంకట రమణయ్య, చాగంటి క్రిష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, ఓరుగంటి మార్కండేయులు పాల్గొన్నారు.



కావలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



కొండాపురం: కేకు కట్ చేసి తినిపించుకుంటున్న నాయకులు



లింగసముద్రంలో టీడీపీ జెండా ఎగుర వేస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, తదితరులు

### ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ శ్రేణులు మండలంలో ఘనంగా నిర్వహిం చారు. శనివారం ఉదయం లింగసముద్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు పార్టీ జెండాను ఎగురు వేశారు. పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు ఆయన మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే ఎర్రారెడ్డిపాలెంలో ఆ పార్టీ అధ్యక్షుడు యు మాధవ, తిమ్మారెడ్డిపాలెంలో నీలం బ్రహ్మరెడ్డి, విశ్వనాధపురంలో ఉన్నం రమేష్, పెంట్రాలలో గొల్లపల్లి వెంకటేశ్వర్లు, మొగిలిచెర్లలో స్వర్ణ చిన్నా ఇంకా మండలంలోని పలు గ్రామాలలో నాయకులు జెండాలను ఎగురవేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, అడపా నర్సయ్య, ఏ చినకొండయ్య, కిలారి కొండయ్య, మద్దెల రామారావు, కండే మాలకొండయ్య, జంపాల శివప్రసాద్, పి నాగిరెడ్డి, జి బాలనారాయణ, డి సుబ్రహ్మణ్యం, పి బాలకోటయ్య, పి గురునాధం, పులి వెంకటేశ్వర్లు, బి సురేష్, ఎ చినసత్యం, ఎం మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట: జెండాను ఆవిష్కరిస్తున్న కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు

వలేటివారిపాలెం : మండలంలోని చుండి, అంకభూపాలపురం, వలేటివారిపాలెం, ఉప్పలపాడు, పోకూరు, బడేవారిపాలెం, పోలినేనిచెరువు తదితర గ్రామాల్లో శనివారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం ఆయా గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగుర వేశారు. అనంతరం వలేటివారిపాలెం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం మాట్లా డుతూ పేదల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలేటి మధుసూదన్‌రావు, చెరువుపల్లి మాల్యాద్రి, కాకుమాను హర్ష కుమార్, కాకుమాను ఆంజనేయులు, వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరావు, సాదు శ్రీలత, గుత్తా తిరుపతయ్య, ఘట్టమనేని చెంచురామయ్య, ప్రెగడ శ్రీనివాసులు, బక్కమంతుల మాల్యాద్రి పంది లక్ష్మీనారాయణ, మానికొండ కొండయ్య శనివారపు మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేకు కట్‌చేసి నేతలకు తినిపిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కందుకూరు నియోజకవర్గంలో వాడవాడలా శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన స్వగ్రామమైన బడేవారిపాలెం గ్రామంతో పాటు కందుకూరు పట్టణంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ నాయకుల సమక్షంలో దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో, పాత బస్టాండ్ సెంటర్, పోతురాజుమిట్ట, గుర్రంవారిపాలెంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ లక్ష్య సాధనకు, రాష్ట్రాభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వలేటివారిపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న లక్ష్మీనరసింహం

### మొక్కుబడిగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం

అల్లూరు, (ఆంధ్రజ్యోతి): పేదల కష్టాలను తీర్చేందుకు పుట్టిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని పార్టీ నాయకులు శనివారం మొక్కుబడిగా నిర్వహించారు. పార్టీ అధికారం చేపట్టాక మండల, గ్రామస్థాయి నాయకులు ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడానికి ఒక్కరూ ముందుకు రాకపోవడంతో కార్యకర్తలు విస్మయానికి గురయ్యారు. కార్యకర్తలను కలుపుకుపోయే నాయకులు లేకపోవడంతో ఇలాంటి పరిస్థితి నెల కొందని కార్యకర్తలు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరిపే విషయంలో ఎవరూ ఆసక్తి కనపరచకపోవడంతో స్థానికంగా పలు విమర్శలకు దారి తీస్తోంది.

### తెలుగుదేశం ఆవిర్భావ వేడుకలు

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పార్టీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, పెద్దపాడులో టీడీపీ రాష్ట్ర రైతుకార్యనిర్వాహక కార్యదర్శి బీవీ.రామారావు, పోలంపాడులో సీనియర్ నాయకులు కల్లూరు చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పార్టీ జెండా ఎగురవేశారు. చీమల తాతయ్య, బీవీ రామారావు, చంద్రమౌళి, ఊసా మాల్యాద్రి, కాకు మహేష్, స్వర్ణ కొండయ్య, నిశ్శంకర సురేష్, జిర్రా పెదఅంకిరెడ్డి, వెంకట్రావు, నాగిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బజారు కూడళ్లలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ మండల కన్వీనర్ మాలేపా నాగేశ్వరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు ఎల్.సుధీర్‌బాబు, సీహెచ్.వెంకటేశ్వర్లు, డీ.అంజయ్య యాదవ్, రామోహన్‌రెడ్డి, మాధవరావు, ప్రభాకర్, మైనార్టీ నేతలు అహ్మద్‌భాషా, రఫీభాయ్, శీనయ్య, జానకీరామ్, కే.తిరుపతయ్య, ఎన్.రంగయ్య ఉన్నారు.



కలిగిరి: జెండా ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు



జలదంకి: ప్రసంగిస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి

● ఉలవపాడు : మండల కేంద్రం ఉలవ పాడులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పార్టీ జెండాను మండల టీడీపీ అధ్యక్షుడు రాచ గల్లు సుబ్బారావు ఆవిష్కరించి, నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. అదే విధంగా కృష్ణాపురం సర్పంచ్ హనుమంతురావు, కరేడు టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు ప్రసాదు, ఆత్మకూరు టీడీపీ నాయకులు కృష్ణ, రాములు, చాగొల్లు పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు, వీరేపల్లి, భీమవరం, రామాయ పట్నం, బద్ధిపూడి గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ఉలవపాడు: పార్టీ జెండాను ఆవిష్కరించి సంబరాలు చేసుకుంటున్న కృష్ణాపురం టీడీపీ నాయకులు, కార్యకర్తలు



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

● సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ

కావలి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లా డారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం 50శాతం రాయితీతో రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకతీతంగా యంత్ర పరికరాలు, వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు రెండవవిడతలో సబ్సిడీ యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకృతి వ్యవసాయ పద్దతిలో పండించిన పంటల స్టాల్‌ను, ప్రకృతి వ్యవసాయ కషాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడిఏ నాగరాజు, తహసీ ల్దారు శ్రావణ్ కుమార్, ఎమ్పీడీవో శ్రీదేవి, మండల వ్యవసాయాధి కారి లలిత, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ బాబు, ఏగూరి చంద్రశే ఖర్, టీడీపీ ప్రధాన కార్య దర్శి ఉప్పాల వెంకట్రావ్, చింతం బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్సై నారాయణకు టీడీపీ నేతల సన్మానం

లింగసముద్రం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఎం నారాయణను టీడీపీ నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి అంగుళూరి చినకొండయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లూరి ముసలయ్య, పెంట్రాల పంచాయతీ క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్ గొల్లపల్లి వెంటకేశ్వర్లు, టీడీపీ నాయకులు మన్నేపల్లి నాగేశ్వరరావు, చిట్టిబోయిన గంగాధర్ పాల్గొన్నారు.



లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నారాయణను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

## పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

● విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు ● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కందుకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో పేద లకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లు, సిబ్బందికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. కందుకూరు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం సాయంత్రం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన అన్నిమందులు అందజేయాలని, బయట నుంచి తెచ్చు కోవాలని రాసివ్వటం చేసినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలా గే కొందరు విధులకు సకాలంలో హాజరుకావటం లేదని, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శి స్తున్నారని ఫిర్యాదులు వస్తున్నందున సరిచేసు కోవాలని సూచించారు. గుండెపోటు బాధితులకు తక్షణం అందించాల్సిన 40వేల రూపాయల విలువైన ఇంజక్షన్లు ఉచితంగా ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా ప్రభు త్వం చర్యలు తీసుకున్నందున ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శకుంతల, ఆర్ఎంఓ వెంకటరెడ్డి, డాక్టరు ఇంద్రాణి, మున్సిపల్ కమిషనర్ కె అనూష, అభివృద్ధి కమిటీసభ్యులు గడ్డం మాలకొండయ్య, శిగా తిరుపాలు, మువ్వల భూషయ్య, వంకాయలపాటి మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు పంపిణీ

జలదంకి: రంజాన్, ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని జనసేన ఉదయగిరి నియోజకవర్గ నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లు మహిళలకు శనివారం జలదంకిలో చీరలు పంపిణీ చేశారు. జనసేన నేత నిమ్మలపల్లి రామ్‌చైతన్య నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందనడానికి పార్టీ నాయకులు చేసే సేవా కార్యక్రమాలే నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు తోట మురళీ, నాయకులు పాల్గొన్నారు.

• దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు కొత్త విధానం
• వచ్చే నెల 2 నుంచి అమలు

## నిరీక్షణకు చెక్..

# ఇక స్లాట్ బుకింగ్!

నెల్లూరు (హరనాథపురం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్ (ఆన్‌లైన్ క్యూ మేనేజ్‌మెంట్) విధానం అమలులోకి తెచ్చింది. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆదేశాలు అందాయి. ఏప్రిల్ 2వ తేదీ నుంచి తొలుత జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విధానాన్ని ప్రారంభించి దశలవారీగా జిల్లా అంతటా అమలు చేయనున్నారు.

● ప్రస్తుత విధానానికి స్వస్తి

ఇప్పటివరకు దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకువెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకొనే పద్ధతి అమలులో ఉంది. ఈ విధానంలో ఉదయం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే సాయంత్రానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందో లేదో తెలియని పరిస్థితి. రిజిస్ట్రేషన్ ఇబ్బందులను తొలగించడానికి ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది. స్లాట్ బుకింగ్ చేసినప్పుడు వచ్చే సమయం ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకునే వ్యక్తులు హాజరైతే సరిపోతుంది. ప్రస్తుతం భూములు, ఆస్తుల, వివాహాల రిజిస్ట్రేషన్లకు తప్ప మిగిలిన రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూ నిర్వహణ సరిగా లేక ముందు వచ్చిన వారికి ముందుగా రిజిస్ట్రేషన్ జరగడం లేదు. దీంతో కంప్యూటర్ ఆధారిత నిర్వహణ విధానాన్ని ప్రభుత్వం తీసుకుని వచ్చింది. ప్రస్తుతం అమలులో ఉన్న పద్ధతికి స్వస్తి పలకనున్నారు. ఆస్తులు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు ఏప్రిల్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది. స్లాట్ బుకింగ్ చేసుకోకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే రిజిస్ట్రేషన్లు చేయరు. స్లాట్ బుకింగ్ సమయం అయిపోయిన తరువాత కార్యాలయానికి వెళ్లినా రిజిస్ట్రేషన్ చేయరు. అంటే 12 గంటలకు స్లాట్ బుక్ చేసుకుని 2గంటలకు వెళితే చేయరు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటల తరువాత వాటికి రిజిస్ట్రేషన్లు చేసే వెసులుబాటు కల్పించారు. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాలు ఉండగా, సగటున రోజుకు 300 రిజిస్ట్రేషన్లు జరుతుంటాయి. స్లాట్ బుకింగ్ అందుబాటులోకి వచ్చిన తరువాత నిర్ణయించుకున్న సమయంలో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఒక గంట వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది.

● రోజుకు 39 స్లాట్స్

రోజుకు ఒక సబ్ రిజిస్ట్రార్ పనిచేసే కార్యాలయంలో 39 స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు చేస్తారు. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు పనిచేసే కార్యాలయంలో అయితే, 78 రిజిస్ట్రేషన్లు చేస్తారు. గంటకు ఆరు తగ్గకుండా స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్దేశించారు.

**బుక్ చేసుకోవడం ఎలా..**

- వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వినియోగదారులు ఆన్‌లైన్ ఫారంలో వివరాలు నింపటం ద్వారా సేవలు పొందవచ్చు. ఫారం నింపిన తరువాత అప్లికేషన్ ఐడీ వస్తుంది. ఆ ఐడీ ఆధారంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకొని, ఆ సమయానికి కార్యాలయానికి వెళ్లాలి.
- వెబ్ పోర్టల్ ద్వారా ప్రజలు తమకు కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు క్యూఆర్‌కోడ్‌తో ఒక టోకెన్ వస్తుంది. ఆ క్యూర్ కోడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కూడా వెళుతుంది.
- రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌కు ఎలాంటి ఫీజు ఉండదు. కానీ స్లాట్ రద్దు చేసుకుంటే రూ.100 చెల్లించాలి. రద్దు చేసుకున్న స్లాట్‌ను మళ్లీ బుక్ చేసుకుంటే రూ.200 ఫీజు చెల్లించాలి.
- సెలవు రోజులో కూడా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. అయితే, ముందు రోజు సాయంత్రం ఐదు గంటల్లోగా స్లాట్ బుక్ చేసుకోవాలి. సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రూ.5వేల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- ప్రజలే నేరుగా ఆన్‌లైన్‌లో ఫారం నింపి డేటా ఎంట్రీ చేయటంతో పాటు ఎనీవేర్ విధానంలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ తేదీ ముందు రోజు సాయంత్రం 4 గంటలకల్లా రిజిస్ట్రేషన్ చేయాల్సిన ఆస్తి ఏ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉందో వారికి పంపాలి.
- దస్తావేజు లేఖరులకు, ప్రజలకు శిక్షణ స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు చేసే విధానంపై శనివారం నగరంలోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు లేఖరులకు, ప్రజలకు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ సింహాద్రి శిక్షణ ఇచ్చారు.


స్లాట్ బుకింగ్ విధానంపై దస్తావేజు లేఖరులకు, ప్రజలకు శిక్షణ ఇస్తున్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సింహాద్రి



**స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం**

నెల్లూరులోని ప్రధాన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం. ఈ విధానాన్ని అందరూ వినియోగించుకోవాలి. స్లాట్ బుకింగ్ చేసుకున్న సమయానికి కార్యాలయానికి వస్తే సరిపోతుంది. వేచి ఉండాల్సిన అవసరం లేదు.

**- ఐ. విజయరాణి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్**

**చాలా బాగుంది**

రిజిస్ట్రేషన్ల కోసం ప్రభుత్వ ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ విధానం చాలా బాగుంది. స్లాట్ బుకింగ్ ఫారాన్ని ఈజీగా నింపే వెసులుబాటు ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకొనే వారు ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేదు.



**- పట్నం దుర్గేష్‌బాబు, జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం**

## ఏసీ బస్‌షెల్టర్ రెడీ!

నెల్లూరు నగరంలో ఏసీ బస్‌షెల్టర్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు కొన్నింటిని సిద్ధం చేయడంతో గాంధీబొమ్మ కూడలిలోని షెల్టర్‌ను శనివారం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ సూర్య తేజతో కలిసి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. నగరంలో 7 బస్‌షెల్టర్లు ఉండగా ఒకటి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. మిగిలిన ఆరు ప్రాంతాల్లోని షెల్టర్లను యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరించి త్వరలో అందుబాటులోకి తీసుకు రానున్నారు. ప్రస్తుతం ఎండలు పెరిగి వేసవితాపం మొదలైన నేపథ్యంలో ఈ షెల్టర్లు నగరవాసులకు ఎంతగానో దోహద పడనున్నాయి. అలాగే రోడ్లు శుభ్రం చేసే నాలుగు వాహనాలను కూడా మంత్రి ప్రారంభించారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)


ఏసీ బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, పక్కన నుడా చైర్మన్ కోటంరెడ్డి

## ట్యాక్స్ చెల్లించి ఆర్థికాభివృద్ధికి సహకరించండి

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వేత్తలు, వర్తక వాణిజ్య సేవారం గాల సంస్థలు ట్యాక్స్ చెల్లించి దేశ ఆర్థికాభివృ ద్ధికి సహకరించాలని ఏపీ కస్టమ్స్ కమిషనర్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ ఆనందకుమార్ పుల పాక కోరారు. శనివారం నగరంలోని ఓ హోట ల్‌లో ఆయన చార్టెడ్ అకౌంటెంట్లు, పారిశ్రా మిక, వ్యాపార వేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్, జీఎస్టీ ప్రిన్సిపల్ కార్యదర్శులు దేశంలోని ఉత్పత్తిదారులు, అమ్మకందారులు, సేవారంగా లకు 2025-26 పోస్టు బడ్జెట్‌లో పలు రాయితీ లు ఇచ్చారని, వాటిని సద్వినియోగం చేసుకుని సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌లు చెల్లించి జరిమానా, శిక్షల నుంచి బయటపడా లని తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు మినహా అన్ని రంగాల్లో జీఎస్టీ వసూళ్లు జరుగుతాయని తెలిపారు. గర్భస్థ శిశువు నుంచి మరణించే వరకు ప్రతి ఒక్కరూ పన్ను చెల్లింపు దారులేనని తెలి పారు. జీఎస్టీ ప్రారంభించినప్పుడు 60వేల మంది ట్యాక్స్ పేయర్స్ ఉండగా ప్రస్తుతం లక్షా 40వేల మందికి పైగా ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అమరావతి, రైల్వే, రహదారులు, తదితర అభివృద్ధి ప్రాజెక్టులకు కేటాయింపులు చేసిందన్నారు. ఈ కేటాయింపు లకు పెట్టుబడులు సేకరించడం, ఉత్పత్తులు పెంచడం, ఉపాధి, రవాణా, తదితర రంగాల ద్వారా జీఎస్టీ పెంచడమేనని తెలిపారు. ఇందుకోసం పారిశ్రామిక, వర్తక, వాణిజ్య, రాయితీలు కల్పించిందన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయనను సీఎంఆర్ షాపింగ్‌మాల్, చార్టెట్ అకౌంట్స్ సంఘం, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, సీఏ హిమహా సినీ, నెల్లూరు ట్యాక్స్ బార్ అసోసియేషన్ చైర్మన్ పీఏ వీఎంవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


ఆనందకుమార్‌ను సన్మానిస్తున్న జిల్లా ట్యాక్స్ బార్ అసోసియేషన్ నాయకులు

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చర్యలు

● జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), మార్చి (ఆంధ్ర జ్యోతి) : కల్తీ ఆహార పదార్థాలను విక్రయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాయిం ట్ కలెక్టర్ కార్తీక్ ఫుడ్‌సేఫ్టీ అధికారులను ఆదేశించారు. శనివారం వివిధ రకాల నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించే వ్యాపారులు, తయారీదారులు, హోటల్స్ వారిపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు దాడి చేసి నమోదు చేసిన వివిధ కేసులను జేసీ విచారించారు. సంబంధిత వ్యాపారుకు రూ.1.45 లక్షల జరిమానా విధించారని, నాణ్యతా ప్రమాణాలతో వ్యాపారాలు నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫుడ్‌సేఫ్టీ లైసెన్సులు కలిగి వ్యాపారం చేయాలన్నారు.

**నెలాఖరు వరకే ధాన్యం కొనుగోలు**

ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఈనెలాఖరుతో ముగుస్తుందని జేసీ ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ రబీ ధాన్యం కొనుగోలు ఏప్రిల్ నెల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటి వరకు 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు రూ.122 కోట్లు చెల్లించినట్లు తెలిపారు.

## కుష్బూ ఇడ్లీలో బొద్దింక..!

• సర్దుకు పొమ్మన్న హోటల్ సిబ్బంది
• కమిషనర్‌కు వాట్సాప్ ద్వారా వినియోగదారుడి ఫిర్యాదు



నెల్లూరు(సిటీ), మార్చి 29(ఆంధ్ర జ్యోతి): ఓ వ్యక్తి తన కుమారుడితో కలిసి శనివారం ఉదయం రుచికరమైన అల్పాహారం తినాలన్న ఉద్దేశంతో నగరంలోని మద్రాసు బస్టాండ్ వద్దనున్న ఓ ప్రముఖ హోటల్‌కు వెళ్లాడు. కుష్బూ ఇడ్లీ, నెయ్యి పెసరట్టు ఆర్డర్ ఇచ్చాడు. హోటల్ సిబ్బంది అవి రెండూ తెచ్చి టేబుల్‌మీద పెట్టారు. తీరా చూస్తే కుష్బూ ఇడ్లీలో ఆర్డర్ ఇవ్వకుండానే బొద్దింక వచ్చింది. కంగుతిన్న సదరు వినియోగదారుడు అదేంటని సిబ్బందిని ప్రశ్నించాడు. అది మామూలేకానీ సర్దుకుపోండి అన్నారు. అవాక్కైన అతను వెం టనే తన ఫోన్లో నుంచి ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజకు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసి సదరు హోటల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటు కార్పొరేషన్ ఆరోగ్య విభాగం, అటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు పూర్తిగా ఆపేశారనడానికి ఈ ఘటన నిలువెత్తు నిదర్శనం.

## కోవూరు షుగర్స్‌ను కార్పొరేట్ స్థలాలకు ఎలా ఇస్తారు!?

● మహాధర్నాలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వైద్యం) మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెలకొన్న ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నేతలు, కార్యకర్తలు కలెక్టరేట్ వద్ద శనివారం మహాధర్నా నిర్వహించింది. ముందుగా నగరంలోని వీఆర్‌సీ క్రీడా మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో మంచినీరు, డ్రైనేజీ, దోమల బెడద వంటి ఎన్నో సమస్యలతో నిత్యం ప్రజలు సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోవూరు నియోజక వర్గంలో ఉన్న సహకార చక్కెర కర్మాగారం స్థలాన్ని కార్పొరేట్ కంపెనీ లకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అనకాపల్లి తర్వాత సహకార చక్కెర కర్మాగారం ఉన్నది కోవూరులోనేనని ప్రజలతో ముడిపడి ఉన్న ఈ కర్మాగార స్థలాన్ని అమ్మాలని చూడటం సరికాదని చెప్పారు. వెంటనే దీన్ని పునరుద్ధరిస్తే రైతులు తిరిగి చెరకు సాగుచేస్తారని, కార్మికులకు ఉపాధి కలుగుతుందని అన్నారు. అలాగే కృష్ణపట్నం పోర్టు టెర్మినల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల పెరుగుదలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తిశ్రీనివాసులు, మోహన్‌రావు, చంద్ర రాజగోపాల్, ప్రసాద్, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, షాహినాబేగం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేస్తున్న సీపీఎం నేతలు




## నీళ్లకే కాదు..

# రక్తానికీ కొరతే!

• వేసవిలో తగ్గనున్న నిల్వలు
• బ్లడ్ దొరక్క ఎంతోమందికి ప్రాణాపాయం
• 60శాతం అవసరాలు తీర్చేది రెడ్‌క్రాసే..
• ఎండల్లో వారి సేవలకు విఘాతం
• విద్యాసంస్థలకు సెలవులతో దాతలూ కరువే!

నెల్లూరు (వైద్యం) మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో సాగు, తాగునీటికే కాదు... రక్తం కొరత కూడా తీవ్రంగానే ఉంటోంది. రోగులకు సకాలంలో రక్తం దొరక్క ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కొంతవరకు రక్తం అవసరాలు తీర్చే విద్యార్థులు ఎండాకాలంలో సెలవుల కారణంగా అందుబాటులో ఉండరు. జిల్లా వ్యాప్తంగా 50 వేలమంది రక్తదాతలు ఉండగా, ఇందులో యువత, విద్యార్థులు 30వేల మందికిపైగా ఉన్నారు. కాగా ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి జిల్లాలోని 60 శాతం రోగుల రక్తం అవసరాలను తీరుస్తున్నది. ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్తనిధితోపాటు నారాయణ, అపోలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల బ్లడ్ బ్యాంక్‌లు కూడా ఏటా వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నాయి. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి ఏరియా ఆసుపత్రులలోని బ్లడ్ బ్యాంక్ లు రెడ్‌క్రాస్ సాయంతో రక్తాన్ని సేకరిస్తున్నాయి. నగరంలో సేవా బ్లడ్‌బ్యాంక్, నెల్లూరు బ్లడ్ బ్యాంక్, విజయ బ్లడ్‌బ్యాంక్‌లు కూడా రక్తం సేకరిస్తున్నాయి. వేసవిలో స్వచ్ఛందంగా దాతలు రక్తం ఇచ్చే అవకాశం లేకపోవటంతో పలువురు రోగులు శస్త్రచికిత్సలను వాయిదా వేసుకుంటున్నారు. జిల్లాలో ఏటా 40 వేల యూనిట్ల రక్తం అవసరం కాగా, 30 వేల యూనిట్లు మాత్రమే వస్తున్నది. ప్రతిఏటా మార్చి నుంచి జూన్ వరకు రక్తం కొరత ఎక్కువగా ఉంటుందని పలువురు రక్తనిధి నిర్వాహకులు తెలియచేస్తున్నారు.

● 100లో 15 మంది రక్తం ఇస్తేనే..

జిల్లాలో రక్తం అవసరాలను తీర్చేందుకు ప్రతి 100 మందిలో 15 మంది రక్తదానం చేయాలి. అయితే ప్రస్తుతం ఐదుగురు మాత్రమే రక్తదానం చేస్తున్నారు. ఇక వేసవి లో రక్తం ప్రతి 100 మందిలో ఇద్దరు మాత్ర మే రక్తం ఇస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో జీజీహెచ్ రక్తనిధి బాధ్యతలను ప్రస్తుత అసోసి యేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమూర్తి చేపట్టే వారు. ఆయన హయాంలో రక్తదాన శిబిరా లతో పాటు రక్తదాతలు స్వచ్ఛందంగా ఆసుపత్రిలోని రక్తనిధికి వచ్చి రక్తదానం చేసే వారు. అయితే ప్రస్తుతం జీజీహెచ్ రక్తనిధి కూడా రెడ్‌క్రాస్‌పైనే అధార పడుతున్నది.




**రక్తదాన శిబిరాలను ప్రోత్సహిస్తున్నాం**

వేసవిలో రక్తదానం చేసేవారు చాలా తక్కువగా ఉంటారు. అయితే రెడ్‌క్రాస్ రక్తనిధి ద్వారా రక్తం అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నాం, ప్రత్యేక రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. వేసవిలో రాష్ట్రంలోనే జిల్లా రక్తం సేకరణలో ముందుంటుంది.

**- వాకాటి విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్, నెల్లూరు**

**శస్త్రచికిత్సలు వాయిదా**



వేసవిలో దాతలు తక్కువమందే రక్తదానం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో సకాలంలో రక్తం చిక్కక కొన్ని శస్త్రచికిత్సలను వాయిదా వేసుకునే పరిస్థితి. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ ప్రసవాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇందులో కొంతమందికి అత్యవసరంగా రక్తం అవసరమవుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రసవాలకు దాతలు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అలాగే మిగిలిన శస్త్రచికిత్సలకు అవసరమైన రక్తం అందించేందుకు దాతలు ముందుకు రావాలి.

**- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు**

## మాలకొండ ఆదాయం రూ. 4,60,469

వలేటివారిపాలెం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 4,60,469 ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 6,150, కుంకుమార్చన ద్వారా రూ. 16,080, తలనీలాలు ద్వారా రూ. 17,200, వాహన పూజలు ద్వారా రూ. 1,380, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 1,30,900, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 720, రూము అద్దెలు ద్వారా రూ. 24,570, కవర్లు ద్వారా రూ. 3,300, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 1,48,935, అన్నదానం ద్వారా రూ. 1,01,227, విరాళముల ద్వారా రూ. 10 వేలు ఆదాయం వచ్చినట్లు ఆలయ డీసీ సాగర్‌బాబు తెలియజేశారు.

## నెల్లూరులో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు

● సీఎండీ సంతోష్‌రావు


రేబాలవారివీధిలో సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు


నెల్లూరు(జడ్పీ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు విద్యుత్ సంస్థ సీఎండీ సంతోషరావు తెలిపారు. శనివారం నెల్లూరుకు వచ్చిన ఆయన మంత్రి నారాయణను కలిసి నగరంలో త్వరలో ఏర్పాటు చేసే పనులను వివరించారు. అనంతరం పలుప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీబొమ్మ దగ్గర కంటైనర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని వివ రించారు. ఎస్పీడీసీఎల్‌లో ఇది తొలి కంటైనర్ సబ్‌స్టేషన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ విజయన్, ఈఈలు బాలచంద్ర, శ్రీధర్, పరంధామయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రికి గోటితో ఒలిచిన తలంబ్రాలు


భద్రాద్రికి పయనమైన కోటి తలంబ్రాలు

కలిగిరి, మార్చి29(ఆంధ్రజ్యోతి): సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఒడ్లు ఒలుపు-శ్రీరాముని పిలుపు కార్యక్రమంలో భాగంగా గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలకు శనివారం పట్టణంలోని కలిగిరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దంపతులు ముఖ్య అతిధిలుగా పాల్గొన్నారు. అనంతరం వాటిని ప్రత్యేక కళశాలల్లో నింపి కలిగిరమ్మ ఆలయం నుంచి కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం వరకు భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. 41రోజు దీక్షతో కలిగిరి, వింజమూరు, కొండాపురం, జలదంకి మండలాల నుండి వచ్చి అశేష భక్తజనంతో సమరసతసేవా ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో కోటి తలంబ్రాలను తరలిస్తున్నట్లు చెప్పారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలం, ఒంటిమిట్ట దేవాలయాల్లో జరుగనున్న కళ్యాణ మహోత్సవంలో వీటిని వినియోగిస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక్ కర్రా భాస్కర్, కదిరి రంగారావు, స్రవంతి, అంజమ్మ, ప్రసాద్‌రెడ్డి, శ్రీహరినాయుడు, రమాదేవి, రాణెమ్మ మాలేపాటి మల్లిఖార్జున, మాల్యాద్రినాయుడు, హరిగోపాల్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా ఊంజల్ సేవ



రాపూరు, మార్చి 29 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచు లక్ష్మీ దేవికి ఊంజల్ సేవను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూ ర్తులను అలంకార మండపానికి తీసుకొచ్చి అక్కడ తిరుచ్చిపై కొలువుదీ ర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహిం చారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వేడుకగా జరిపారు. ఉగాది పర్వాదినాన పెంచలకోనలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## పెంచులోరి సేవలో హైకోర్టు జడ్జి

రాపూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ కె శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు శనివారం పెంచలకోన క్షేత్రాన్ని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్వాగతం పలికారు. ఈయనతో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ కోర్ట్ నెల్లూరు వారు విచ్చేయగా అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గుండ్లూరు సీతారామయ్య స్వామి, శశి స్వామి ఆలయ సిబ్బంది ఉన్నారు.

**బంగారం, వెండి ధరలు**

| | |
|---|---|
| బంగారం (22 క్యారెట్లు) | |
| ఒక గ్రాము ధర | రూ.8611 |
| వెండి కిలో ధర | రూ. 1,03,100 |
| వెండి ఒక గ్రాము | రూ.106.20 |

# టీడీపీతోనే పేదలకు సంక్షేమ పథకాలు

- ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు
- వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి



బుచ్చి: వేడుకలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



పొదలకూరు: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మండల టీడీపీ నాయకులు



వెంకటాచలం: కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



ఇందుకూరుపేట: నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు



కొడవలూరు: ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మనుబోలు: ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం తరువాతనే రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం అక్కంపేటలో జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రంజాన్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకులు అమీర్‌భాషా ఎమ్మెల్యే చేతులమీదుగా గ్రామంలోని మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన ప్పటినుంచి టీడీపీలోనే ఉంటూ ఎన్టీఆర్, చంద్రబాబు, లోకేష్‌బాబులతో పనిచేసే అవకాశం దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు, మధునాయుడు, వేలూరు కోదండరామి రెడ్డి, ఆంజనేయులు, వేణుగోపాల్ రెడ్డి, పూండ్ల రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు, సాని వెంకట రమణయ్య, వెంకటరమణారెడ్డి, ప్రసాద్, ముంగర విజయ భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలను ఎప్పటికీ విస్మరించను అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. బుచ్చిరెడ్డిపాళెం మర్రిచెట్లు సెంటర్‌లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం పద్మావతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఏడాదిలోగా బుచ్చిలో దివంగత ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పార్టీని ఎన్టీఆర్ స్థాపిస్తే తెలుగు ప్రజల ప్రతిభకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. ఈ సందర్భంగా 43 ఏళ్లు పార్టీ జెండామోసిన నాయకులు సుబ్బారెడ్డి, బషీర్ లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, వైస్ చైర్మన్లు, శివకుమార్‌రెడ్డి, నస్రీన్ ఖాన్, కౌన్సిలర్లు వైష్ణవి, సత్యం, రామానాయుడు, రామకృష్ణా రెడ్డి, మల్లారెడ్డి, వంశీకృష్ణారెడ్డి, కమలాకర్ రెడ్డి ఉన్నారు.

● విడవలూరు (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పార్టీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, మాతూరు శ్రీనివాసులురెడ్డిలు,రామ తీర్థంలో ఆవులవాసు, శ్రీహరికోట గోపి, తాతా రమేష్, చిన్నిబాబులు, మాడా నరేంద్రలు సీనియర్ నాయకులు కొండూరు శ్రీరాములును సత్కరించారు. పార్లపల్లి వేడుకలో పూండ్ల ఏ సోబు, సుధీర్, ఫీల్ట్ అసిస్టెంటు అల్లాభాషలు, ముదివర్తిలో మండల కో ఆప్షన్ మెంబరు ఎస్.కె.రఫీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఊటుకూరులో కోవూరు ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డిలు పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. దండిగుంట, వరిణి పంచాయతీల్లో జరిగిన వేడుకలో మల్లికార్జున, రఘు, రాజ పాల్గొన్నారు.

● మనుబోలు (ఆంధ్రజ్యోతి): మనుబోలులో జరిగిన వేడుకలో తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, కోదండరామపురంలో సర్వేపల్లి తెలుగు యువత అధ్యక్షుడు శివుడు రాజాగౌడ్, చెర్లోపల్లిలో పొ న్నూరు వేడుకలో అశోక్, గురి విందపూడిలో సర్వేపల్లి శివ కుమార్ శర్మ, వెంకన్నపాళెంలో శేఖర్‌నాయుడు, రాష్ట్ర రైతు కార్యదర్శి. కిరణ్‌కుమార్, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

● పొదలకూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు ఆవరణలో జరిగిన వేడకలో టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, బక్కయ్యనాయుడు, మహిళామండల అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, వెంపు లూరు అరుణమ్మ, ఆకులూరు విజయ్, అమర్తలూరు చెంచయ్య, పిన్నెల్లి ప్రభాకర్ ఉన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకులు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి పిన్నెల ప్రభాకర్‌తో కలిసి చలివేం ద్రాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ మండలాధ్యక్షులు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షులు మల్లికార్జున్ నాయుడు మజ్జిగ పంపిణీ చేశారు.

● వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ అనుబంధ సంఘాల నేతలతో కలిసి పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మావిళ్లపల్లి శ్రీనివాసులు నాయుడు, ఇడిమేపల్లి మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య ఉన్నారు. నిడిగుంటపాళెంలో తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, సీనియర్ నేత రావూరి పద్మనాభనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో బీజేపీ మండలాధ్యక్షుడు అసనాపురం శ్రీనివాసులు పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట, (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట, కొత్తూరు, కొరుటూరు, మైపాడు, పల్లిపాడు, కుడితిపాలెంలో టీడీపీ కన్వీనర్ వీరేంద్రనాయుడు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో పొన్నెబోయిన చెంచుకిషోర్ యాదవ్, మునగాల రంగారావు, గంపల అనీల్‌కుమార్, బొద్దుకూరు సుధాకర్, ఏడుకొండలు, వెంకటేశ్వర్లురెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

● కొడవలూరు (ఆంధ్రజ్యోతి): నార్తురాజుపాలెంలోని ప్రధాన కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు కరకటి మల్లికార్జున పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే యల్లాయపాలెంలో జరిగిన వేడుకలో నీటి సంఘం అధ్యక్షుడు కేతు వెంకటరమణారెడ్డి, తువ్వర ప్రవీణ్ కుమార్, నాసిన ప్రసాద్ పాల్గొన్నారు.

● తోటపల్లిగూడూరు (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో జరిగిన వేడుకలో తిరుపతి పార్లమెంటు కార్యదర్శి కొణతం రఘుబాబు, విజయ డెయిరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాస రెడ్డి, మాజీ ఎంపీపీ ఇంగిలాల నిర్మలమ్మ, కోడూరు సాగు నీటి సంఘం అధ్యక్షులు రాపర్ల మల్లికార్జున ప్రసాద్‌చౌదరి, రావి అనిల్‌నాయుడు, ముత్యాల శ్రీనివాసులు, నెల్లపూడి సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● కోవూరు (ఆంధ్రజ్యోతి): పడుగుపాడులో జరిగిన వేడుకలో పార్టీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డి, జెట్టి మదన్‌మోహన్‌రెడ్డి, దారపనేని శ్రీనివాసులు నాయుడు, పఠాన్ నజీర్ పాల్గొన్నారు. స్థానిక రైల్వేఫీడర్సు రోడ్డులో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, ధారా విజయబాబు, పిచ్చుక మధుసూదనరావు పాల్గొన్నారు. ఇనమడుగులో కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, మాజీ ఎంపీపీ గిద్దలూరు ఉమ, మాజీ సర్పంచు పెరిమి చెంచమ్మ ఎంపీటీసీ సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

● ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో షేక్‌షఫీవుల్లా, నడవడి ముత్యంగౌడ్, బొలిగర్ల శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు ఏడుకొండలు, రమణయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు. మెట్టపాలెంలో పంటపాలెం సాగునీటి సంఘం అధ్యక్షులు మునుకూరు మురళీధర్‌రెడ్డి, మారంరెడ్డి విక్రమ్‌రెడ్డి, పేర్నేటి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. బ్రహ్మదేవంలో కొత్తపల్లి రమేష్‌శర్మ, సతీష్, అలిముత్తు, వల్లూరులో వల్లూరు మోహన్‌రావు, కప్పల దొరువులో గోనెల సిద్ధయ్య, కృష్ణపట్నంలో రాగాల శివకృష్ణ పాల్గొన్నారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక ఎంపిడివో కార్యాలయం సమీపంలో ఉన్న టీడీపీ శిలా ఫలకం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నల్లవడ్ల వెంకట రమణ రెడ్డి, సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మెంబర్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ పచ్చిగళ్ల రత్నం, మైనారిటీ నాయకుడు చాన్ బాషా, జనసేన వీర మహిళ కొండాపురం కస్తూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరులో..



## పౌరహక్కులపై అవగాహన సదస్సు

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి 29 (ఆంధ్రజ్యోతి):ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు సమాజంలో స్వేచ్ఛగా జీవించాలని అందుకు ఎవరైనా ఆటంక కల్పించినా అభ్యంతరాలు చేసినా చట్టపర చర్యలు తప్పవని తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం చెల్లాయపాళెంలో అవగాహన సదస్సు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు తమ్మిరెడ్డి మల్లికార్జున పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పొదలకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిగేడు గ్రామ సమీపంలో శనివారం రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంగం నుంచి తిరుపతికి వెళుతున్న ఇసుక లారీ డేగపూడి కూడలి వద్ద మరో లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుకనే వస్తున్న ముందు లారీని ఢీకొన్నది. గమనించిన గ్రామస్థులు అతన్ని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా

పొదలకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీమంజిల్‌లోని పేద ముస్లింలకు జనసేన ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను పార్టీ సర్వేపల్లి సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణీభవానీనాయుడు, మండల నాయకులు, నారదాసు రవి, మధు, సందూరి శ్రీహరి మనోజ్, ప్రసాద్, గిరీష్, జమీర్, మంజూర్, బాషా, శుభన్ పాల్గొన్నారు.

## ముందస్తు ఉగాది సంబరాలు

వెంకటాచలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):కసుమూరు బ్రిలియంట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. ముందుగా పాఠశాలకు మామిడి తోరణాలు కట్టారు. సాంప్రదాయ దుస్తులతో హాజరై చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ రూబీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మర్రి ఆకుపై శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం

పొదలకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహమ్మదాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ పచ్చా పెంచలయ్య మర్రి ఆకుపై శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం చెబుతూ సూక్ష్మ చిత్రాన్ని గీశారు. ఈ ఆకుపై పూర్ణకుంభం, ఉగాదిపచ్చడి, వేపపూత, మామిడి, అరటికాయలు, పసుపుకుంకుమ భరణితో తెలుగు సంవత్సరాదిని ప్రతిబింబించేలా అద్భుతం శ్రీవిశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం చెబుతూ చిత్రాన్ని గీశారు.



## కామాక్షితాయి సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



పూజలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం,మార్చి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆయంలో శనివారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డి దంపతులు శ్రీ మల్లికార్జున స్వామి, కామాక్షి తాయి వారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈఓ. ఏవీ. శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ సాంప్ర దాయాలతో వారిని స్వాగతించారు. అనంతరం వారి గోత్ర నామాలతో స్వా మి,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు అందజేసి శేషవస్త్రములతో సత్కరించారు. వారి వెంట జిల్లా న్యాయాధికారులు, పోలీసులు వున్నారు.

## పడుగుపాడు సొసైటీలో రక్తదాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న అధికారులు

కోవూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లోని పడుగుపాడు సహకార పరపతి సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన శనివారం రక్తదాన శిబిరాన్ని జిల్లా సహకార శాఖాధికారి తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్దసంఖ్యలో రైతులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, సొసైటీ పర్సన్ ఇన్ చార్జి సుబహ్మణ్యం, కో ఆపరేటివ్ విద్యాధికారి గోగుల శ్రీనివాసులు, సొసైటీ సీఈఓ కొండూ రు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సహకారశాఖ అధికారులు సొసైటీ నిర్వహిస్తున్న ఇనమడుగులోని పెట్రోలు బంకును పరిశీలించారు.

## నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

మనుబోలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయంలో శనివారం మండల సమావేశం నామమాత్రంగా నిర్వహించారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరకొరగా వచ్చిన అధికారులు వారి శాఖల వివరాలు, ప్రగతిని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చిట్టమూరు అనితమ్మ, మండల ఉపాధ్యక్షుడు తిక్కవరపు వెంకటరమణారెడ్డి, తహసీల్దార్ సిహెచ్, సుబ్బయ్య, ఎంపీడీవో జలజాక్షి పాల్గొన్నారు.

### 2న మండల సర్వసభ్య సమావేశం

విడవలూరు (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎకుల శేషమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నగేష్‌కుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

## బ్రిటీషు కాలం నాటి ఇరిగేషన్ బంగళా

వెంకటాచలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని సుదీర్ఘకాలం పాటు పరిపాలించిన ఆంగ్లేయులు లేకపోయినా వారు నిర్మించిన పలు కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీలోని జోసఫ్‌పేట వద్ద సర్వేపల్లి రిజర్వాయర్‌కు సంబంధించిన ఇరిగేషన్ బంగళా వీటిలో ఒకటి. స్వాతంత్ర్యం రాకపూర్వం ఆంగ్లేయులు సర్వేపల్లి రిజర్వాయర్‌ను నిర్మించారు. అయితే రిజర్వాయర్ సందర్శనకు వచ్చే అధికారులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా రిజర్వాయర్ వద్ద ఈ బంగళాను నిర్మించారు.



సర్వేపల్లి రిజర్వాయర్ వద్ద ఉన్న బంగ్లా

**C.R.I.M.E N.E.W.S**

## తండ్రి మందలించాడని తనయుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రామశివశరణ్

నెల్లూరు(క్రైం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): చదువులో శ్రద్ధ చూపడం లేదని తండ్రి మందలించడంతో తనయుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని స్టోన్‌హౌస్‌పేట ముగ్గురాళ్లవీధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ముగ్గురాళ్లవీధిలో నివాసం ఉంటున్న శంకర్ వరప్రసాద్, ఉషారాణి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రామశివశరణ్ (18) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశాడు. ఇంట్లో ఉంటూ చదువుపై శ్రద్ధ చూపడం లేదని తండ్రి మందలించేవాడు. ఈ క్రమంలో వరప్రసాద్ సరస్వతి నగర్‌లో నూతన నిర్మించిన ఇంటి వద్దకు శనివారం అందరూ కలిసి వెళ్లారు. అక్కడి నుంచి కుమారుడు రామశివశరణ్ గ్యాస్ సిలిండర్ తీసుకువచ్చేందుకు పాత ఇంటికి వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫోన్ చేశాడు. తీయకపోవడంతో ఆయన ఇంటికి వెళ్లి చూడగా కుమారుడు హాల్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. వరప్రసాద్ బోరున గుండెలు బాదుకుంటూ స్థానికుల సహకారంతో కుమారుడిని కిందకు దించి చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించారు.

## రైలు కిందపడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): వందేభారత్ రైలు కిందపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం నెల్లూరు నగరంలోని హౌసింగ్‌బోర్డు వద్ద రైల్వే పట్టాలపై జరిగింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా గుర్తుతెలియని స్థితిలో ఉంది. మృతదేహానికి సమీపంలో లభ్యమైన ఆధార్‌కార్డు ఆధారంగా పోలీసులు విచారించారు. మృతుడు మనుబోలుకు చెందిన సాయికృష్ణ(31)గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో వివాహిత..



మృతురాలు ఆదిలక్ష్మి

తోటపల్లిగూడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన అక్కయ్యగారి ఆదిలక్ష్మి (34) శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందా రు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ఉదయం 7గంటల సమయంలో తన భర్త యాదగిరితో కలిసి వారి రొయ్యలగుంట వద్ద వెళ్లింది. ఈ సమయంలో పశువులకు మేత వేస్తుండగా గట్టు మీద ఉన్న కరెంటు వైరు రెండు కాళ్లకు తగిలి షాక్‌తో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ మేరకు ఆమె భర్త యాదగిరి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వీరేంద్రబాబు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు




ఉదయగిరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అడవి పందిని ఢీకొని మోటార్‌బైక్ బోల్తాపడి ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన దుత్తలూరు సెంటర్ సమీపంలో శనివారం చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన సునీత, కుమారుడు వెంకటరాంచరణ్, తండ్రి బద్దిక సుబ్బరాయుడుతో కలిసి వింజమూరు మండలం మోటచింతలపాళెంకు మోటార్‌బైక్‌పై వెళుతున్నారు. ఈక్రమంలో దుత్తలూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా అడవిపంది రావడంతో దానిని ఢీకొని కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించడంతో వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కావలికి తరలివెళ్లారు.

## మూడు లారీల ఢీ

● తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన లారీలు

కోవూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం మూడు లారీలు ఢీకొన్నాయి. మొదట రెండు లారీలు నెల్లూరు నుంచి కావలి వైపు వెళుతున్నాయి. అతివేగంతో వాహనాన్ని క్రాస్ చేసే సమయంలో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు తగలకపోవడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సమ యంలోనే చిత్తూరు నుంచి శ్రీకాకుళం వెళుతున్న మరో లారీ డ్రైవర్ ఈ ప్రమాదాన్ని గుర్తించక ఈ వాహనాలను వచ్చి ఢీకొన్నాడు. లారీలో ఉన్న రూ.1కోటి మద్యం సరుకులో ఒక్క బాటిల్ కూడా కింద పడకపోవడం విశేషం. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవరుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 130 |
| స్కిన్ చికెన్ | 234 |
| స్కిన్‌లెస్ | 260 |

కోడిగుడ్ల ధర (100): 445



## ఎరుకల కాలనీల్లో వసతులు కల్పించాలి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 29(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎరుకల కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ ఏపీ ఎరుకల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శివ, తదితరులు శనివారం జడ్పీ సీఈవో విద్యారమకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకల కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వసతులు లేవన్నారు. చాలా మందికి ఇళ్లు కూడా లేవన్నారు. కాలనీల్లో వసతులు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

### న్యూస్ బాక్స్

**నేడు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి నగరోత్సవం**

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి లోక కళ్యాణార్థం ఆదివారం శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వీ.గిరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నగరోత్సవం సందర్భంగా ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలతోపాటు పటిష్టమైన క్యూలైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. శీఘ్ర దర్శనంకు రూ.100, ఉచిత దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు తాగునీరు, ఉచిత ప్రసాదాలు కల్పిస్తున్నామన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు ఉదయం ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. రాత్రి 7గంటలకు వైభవంగా నగరోత్సవం జరుగుతుందని వివరించారు.

**రంగనాథస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు**

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ఆదివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామిలకు తిరుమంజనం సేవ, సాయంత్రం 6గంటలకు పంచాంగ శ్రవణం అర్చకులకు సన్మానాలు జరుగుతాయని ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది సందర్భంగా ఉదయం 9.30 గంటలకు వేదగిరి లక్ష్మీనరసింహస్వామి రంగనాథుని ఆలయానికి విచ్చేస్తారు. భక్తులందరూ తరలిరావాలని కోరారు.

**కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉగాది సారె సంబరాలు**

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ఉగాది సారె వేడుకలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక చైర్మన్ షేగు షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 7.30 నుంచి 12.30 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 9.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సారెలో చీర-1, బియ్యం-కేజీ, పెసరపప్పు-250 గ్రాములు, బెల్లం-200గ్రాములు, జీడిపప్పు, ద్రాక్ష, ఎండు కొబ్బరిచిప్పలు-2, జాకెట్లు-2, తాంబూలం భక్తులకు సమర్పించాలని కోరారు.

**మహాశివలింగానికి అభిషేకం**

నెల్లూరు(సాంస్కృతికం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పప్పులవీధి సిద్ధి విఘ్నేశ్వరాలయంలో శనివారం మహా శివ లింగానికి, గణపతికి మహాభిషేకాలు జరిగాయి. శ్రీవిశ్వావసు నామ ఉగాది పర్వదినం సందర్భంగా శనివారం రాశులు మార్పుల వలన వచ్చే దోషాల నివారణకు భక్తులు నువ్వుల నూనె, బెల్లం, మినపప్పు, ఉప్పు, నువ్వులతో అభిషేకాలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విఘ్నేశ్వరాలయం కమిటీ పాండురంగ అన్నదాన సమాజం కమిటీలు పర్యవేక్షించాయి.

**హౌసింగ్‌లో అక్రమాలపై చర్యలు చేపట్టండి**

నెల్లూరు (జడ్పీ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): హౌసింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు చేపట్టాలని హౌసింగ్ జిల్లా మేనేజర్ మురళికి బీజేపీ జిల్లా నేత మిడతల రమేష్ ఫిర్యాదు చేశారు. శనివారం ఆయన గృహనిర్మాణశాఖ కార్యాలయానికి వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు అందచేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరి అజయ్‌జైన్ ఆదేశాలు జిల్లాలో అమలు కావడం లేదన్నారు. గతంలో జరిగిన అక్రమాలపై విజిలెన్సు అధికారులు ఇచ్చిన నివేదికలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

**జీజీహెచ్‌లో కేన్సర్‌కు అరుదైన శస్త్రచికిత్స**

నెల్లూరు(వైద్యం), మార్చి 29(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కేన్సర్ విభాగంలో ఓ మహిళకు శనివారం అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఈ సందర్భంగా సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వరుణ్ మాట్లాడుతూ నగరంలోని నవాబ్‌పేటకు చెందిన నజ్రీన్(32) విపరీతమైన కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చిందన్నారు. ఆ మహిళలకు అన్ని రకాల పరీక్షలు చేయగా గర్భసంచిలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అది కేన్సర్ గడ్డగా గుర్తించి దానిని శస్త్రచికిత్స ద్వారా తొలగించగా 5 కిలోల బరువు ఉందని తెలిపారు. ఇలాంటి కేన్సర్ గడ్డను తొలగించడం ఇది తొలిసారి అన్నారు. ప్రస్తుతం బాధిత మహిళ పూర్తిస్థాయిలో కోలుకుంటుందని వెల్లడించారు. డాక్టర్ విజయలక్ష్మి, అనస్థీషియా డాక్టర్ ఖాదర్‌బాషాల సహకారంతో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ వైద్య బృందానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ అభినందనలు తెలిపారు.

# ఖాళీ స్థలాల్లో అసాంఘికాలు!

● పట్టించుకోని అధికారులు ● నివాసితుల ఆందోళన



పద్మావతి నగర్ ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన ముళ్ల చెట్లు

నెల్లూరు(జడ్పీ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఖాళీ స్థలాలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారి చుట్టుపక్కల నివాసాలు ఉంటున్న వారికి శాపాలుగా తయారవుతున్నాయి. అయినప్పటికీ నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. నగరంలో ఖాళీ స్థలాలు భారీగా ఉన్నాయి. నివాసాల మధ్య ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలు ఉండడంతో వాటిలో కంపచెట్లు, పెద్దపెద్ద చెట్లు పెరుగుతున్నాయి. స్థల యజమానులు ఖాళీ స్థలాలను చదునుచేయడం, ఎత్తు లేపడం వంటి చర్యలు చేయక పోవడంతో ఖాళీస్థలాలు చెట్లతో నిండిపోతున్నాయి. ఆ ప్రాంతంలోకి వెళితే బయటప్రాంతాలు కనిపించే అవకాశం లేకుండా చెట్లు కమ్ముకుని ఉన్నాయి. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఆకతాయిలు గంజాయి, మద్యం సేవించడంతో పాటు, అసాంఘిక కార్యక్రమాలు కేంద్రంగా మార్చారు. బాలాజీనగర్, అద్దాల సాయిబాబా గుడి, వేణుగోపాల స్వామి కళాశాలకు మధ్యలో దశాబ్దాల కాలంగా ప్రైవేటు స్థలాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో కంపచెట్లు, ఇతర చెట్లు పెరిగి ఆ ప్రాంతమంతా చెట్లతో బయటప్రాంతాల మనుషులు కనిపించకుండా తయారయ్యాయి. దీనిని ఆసరా చేసుకున్న ఆకతాయిలు, మందుబాబులు, వ్యభిచారులు అడ్డాగా వాడుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఆ ప్రాంతాల వైపు వెళ్లే ప్రజలపైన అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. గంజాయి, మద్యం సేవించడంతో వారిపై వివాదాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి ఖాళీ స్థలాలు నగరంలో కోకొల్లలు. దాని చుట్టుపక్కల ఉన్న నిర్వాసితులకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ దృష్టి సారించి ఖాళీ స్థలాల్లో ఉన్న చెట్లను తొలగించేలా చర్యలు చేపట్టి, ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## సమాజసేవలో ప్రభుత్వ ఉద్యోగులు

● ఏపీ కస్టమ్స్ కమిషనర్ ఆనందకుమార్



పాఠశాల భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ కస్టమ్స్ కమిషనర్ ఆనందకుమార్

నెల్లూరు(విద్య), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు సమాజ సేవలో ముందుంటారని ఏపీ కస్టమ్స్ కమిషనర్ ఆనందకుమార్ పులపాక అన్నారు. నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛభారత్ సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఏర్పరిచిన రాజ్యాంగంతో బడుగు, బలహీన వర్గాలు, పేదలు ఉన్నతంగా ఎదుగుతున్నారన్నారు. చదువుతో జీవితంలో ఏదైనా సాధించవచ్చని, దానికోసం ప్రతి విద్యార్థి నిబద్ధతతో ప్రతిభ చూపాలని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మరుగుదొడ్లను, కుళాయిలను ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో సీఆర్‌సీ నెల్లూరు డైరెక్టర్ ఎస్పీ మనోజ్ కుమార్, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, ఎంఈవో మురళీధర్, ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఆలయాలు, మసీదుల వద్ద

## పారిశుధ్య పనులు చేపట్టండి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా దేవాలయాలు, మసీదుల వద్ద తాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని ఆమె నివాసంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఈ ఉగాది, రంజాన్ పండుగలకు దేవాలయాలకు, మసీదులకు పెద్ద సంఖ్యలో భక్తుల వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

● తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆమె నివాసంలో సైకిల్ అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

## శక్తి యాప్ మహిళలు, బాలికలకు వజ్రాయుధం

● మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రామారావు



శక్తి యాప్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రామా రావు, సీఐ సుబ్బారావు, తదితరులు

నెల్లూరు (వైద్యం), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా నెల్లూరు మహిళా పోలీస్ స్టేషన్ చర్యలు చేపడుతుందని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు పేర్కొన్నారు. శనివారం నగరంలోని సెయింట్ జోసఫ్ జనరల్ ఆసుపత్రిలో మహిళా సిబ్బందికి, నర్సింగ్ విద్యార్థులకు మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల చేతిలో వజ్రాయుధంగా శక్తి యాప్ అందుబాటులోకి వచ్చిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో దీని ద్వారా పోలీసుల నుంచి రక్షణ పొందాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక, వెట్టిచాకిరి వ్యవస్థలు, మానవుల అక్రమ రావాణా, పోక్సో యాక్ట్, మాదక ద్రవ్యాల నిషేధం వంటి వాటి నియంత్రణకు 100, 112, 1098, 1930 నెంబర్‌లకు డయల్ చేయాల న్నారు. ఈ కార్రక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐలు టీవీ సుబ్బారావు, కృష్ణారెడ్డి, ఆసుపత్రి అడ్మిన్ సిస్టర్ మేరీ, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్ఐ శ్రీహరి, సతీష్, ప్రసాద్, రంబాబు, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు



33వ డివిజన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని 12వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో దశబ్దాకాలం తరువాత టీడీపీ జెండా రెపరెపలాడిందని ఆ పార్టీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం పార్టీ 43వ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ ప్రాంత ప్రజలు ఆధిపత్యానికి స్వస్తిపలికి ప్రజాపాలనకు స్వాగతద్వారాలు తెరిచి 2024 ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలిపి తమ కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు. ఎన్టీఆర్ నెలకొల్పిన టీడీపీ చంద్రబాబు, లోకేష్‌ల నాయకత్వంలో బలమైన శక్తిగా నిలిచిందని వెల్లడించారు. నెల్లూరురూరల్లో మరింత బలంగా నిలుపు తామని ప్రకటించారు.

● 28వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డపనేని రాజానాయుడు, కార్పొరేటర్ అహల్యా, తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

● కలివెలపాళెం టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం నెల్లూరులోని కార్యాలయంలో 33వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు వనం శ్రీరాములు, గొలగమూడి నారాయణ, గిరీష్‌ల మిత్రబృందాన్ని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● నెల్లూరు(వైద్యం) : నగరంలోని పలు డివిజన్‌లలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. 33వ డివిజన్‌లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మన్నెం పెంచలనాయుడు, కార్పొరేటర్ కరణం మంజుల, నాయకులు హజరత్‌నాయుడు, దామినేని బుజ్జయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

● నర్తకీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు డాక్టర్ గణేష్‌కుమార్, కల్వకుంట్ల భాస్కర్, అద్దంకి చంద్ర, రాజ్‌కుమార్, సిద్దకళాచారి, రత్నం, సుధా, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ధర్మవరం

● పత్తేఖాన్‌పేట రాగిచెట్టు సెంటర్‌లో టీడీపీ నేత భాసనపల్లి శశిధర్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఇండ్ల షణ్ముకేశ్వర్‌రావు, పసుపులేటి హరీష్, పిల్లేల ధనుంజయ, సురేంద్ర, సుబ్బయ్య, నందిమండలం పుల్లమ్మరాజు, దుర్గాప్రసాద్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

● 44వ డివిజన్‌లో నెల్లూరు పార్లమెట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు దర్శి హరికృష్ణ ఆధ్వర్యంలోజెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఏడుకొండలు, సత్యనాగేశ్వరరావ్, పొలూరు బ్రహ్మం, రియాజ్, రమేష్‌బాబు, నన్నే సాహెబ్, యానాదిరెడ్డి, దర్శి వెంకట జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.







## కోర్టులో సమస్యలు పరిష్కరించాలి

● హైకోర్టు న్యాయమూర్తికి న్యాయవాదుల వినతి



రంగనాథుడి సేవలో హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి దంపతులు

నెల్లూరు(లీగల్), మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి కె.శ్రీనివాసరెడ్డిని శనివారం ఐక్యవేదిక ప్యానల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కలసి కోర్టులో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నెల్లూరు బార్ అసోసియేషన్ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా న్యాయవాదులు అయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.రామకృష్ణ ప్రసాద్, జల్లి పద్మాకర్, కే.రవికుమార్, వేలురు రంగారావు, ఎల్లసిరి మురళీధర్ రెడ్డి, కాకి శాంతికుమార్, పువ్వాడి శంకరయ్య, సాడ్విన్ కుమార్, నక్కా శీనయ్య సాగర్, బాబావలి పాల్గొన్నారు. అలాగే జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు జడ్జి కె.శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జడ్జి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి సి.యామిని, వైసురేష్, నారాయణరెడ్డి, కె.దీపక్, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్**

నెల్లూరు(హరనాథపురం): హైకోర్టు న్యాయమూర్తి, నెల్లూరు జిల్లా పరిపాలనా జడ్జి కె.శ్రీనివాసరెడ్డిని శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ ఆనంద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

**రంగనాథుడి సేవలో...**

నెల్లూరు(సాంస్కృతికం) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసరెడ్డి కుటుంబం దర్శించింది. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. వారి వెంట జిల్లా న్యాయాధికారి యామిని ఉన్నారు.

## క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన అండగుండ హరీష్‌ను శనివారం పద్మశాలి యువసేన, అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా ప్రతినిధులు పరామర్శించారు. ఆయన వైద్య ఖర్చులకు అతని కుటుంబ సభ్యులకు రూ.51వేల అందించారు. ఏపీ పద్మశాలి యువసేన రాష్ట్ర ప్రతినిధి ఎం రమేష్, బుధవరపు బాలాజీ, సోమా గోపాల్, గుత్తికొండ శ్రీనివాసరావు, పెంచలయ్య, మార్కాపురం లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## నెల్లూరులోని పార్కుల్లో అద్దాల గదుల నిర్మాణం

● మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(సిటీ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఉన్న పార్కుల్లో చిన్నపాటి ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు అద్దాల గదులను నిర్మించతలపెట్టినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నగరంలోని మైపాడుగేట్, నవాబుపేట ప్రాంతాలలో పార్కులను ఆయన సందర్శించారు. అక్కడ వ్యాయామం, నడక చేస్తున్న వారితో మాటామంతీ కలిపారు. సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేదలు, నిరుపేదలు తమ కుటుంబాలలోని చిన్నపాటి ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు వీలుగా వినూత్నంగా అద్దాలతో గదులు నిర్మిస్తామని చెప్పారు. నగర వాసులకు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా రూ.2లకే 20 లీటర్ల సురక్షిత తాగునీరు అందించేందుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. గ్రీన్ కార్పొరేషన్ ద్వారా నగరాల్లో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదం, పచ్చదనం దగ్గర చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఉచ్చికి ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శ



ఉచ్చి భువనేశ్వరప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ కార్పొరేట్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్‌ను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. రెండవసారి మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఉచ్చిని ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ భువనేశ్వరప్రసాద్ త్వరగా కోలుకోవాలని ఆకాం క్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాల్లో స్వచ్ఛభారత్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 29(ఆంధ్రజ్యోతి): అల్లీపురంలోని టిడ్కో గృహాల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ టిడ్కో గృహాల అభివృద్ధికి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ కృషి చేస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్ర సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, వెంకట్ యాదవ్, దాసరి పోలయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# నవ వసంతం

**జిల్లా అభివృద్ధిపై చిగురిస్తున్న ఆశలు**

ఐదేళ్ల అరాచకం అంతమైంది. విధ్వంసంలోంచి నిర్మాణం దిశగా పాలన మళ్లింది. కొత్త ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత వస్తున్న తొలి ఉగాదికి తిరుపతి జిల్లా ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలుకుతున్నారు. ఈ పది నెలల కాలంగా జిల్లాలో జరుగుతున్న పనులను చూసి భవిష్యత్తుపై నమ్మకాలు పెంచుకుంటున్నారు. విశ్వావసు నామ సంవత్సరంపై జిల్లా ప్రజల్లో చిగురు తొడుగుతున్న ఆశలు ఇవీ...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



### పులికాట్ పూడికతీతకు అడుగులు

పులికాట్ సరస్సులో పూడిక తీత పనులకు కదిలిక రానుంది. దశాబ్దాలుగా సముద్ర ముఖద్వారాల వద్ద పూడికతో పులికాట్‌లోకి నీరు రావడం తగ్గింది. మత్స్య ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. మత్స్యకార కుటుంబాలు నష్టపోతున్నాయి. పూడిక తొలగింపునకు గతేడాది కేంద్ర ప్రభుత్వం రూ.97 కోట్లు మంజూరు చేసింది. ఏపీ మ్యారిటైమ్ బోర్డు ద్వారా ఈ ఏడాది పనులు ప్రారంభించనున్నారు.

### ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో కదలిక!

సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్, గాలేరు-నగరి, అల్లూరుపాడు, బాలాజీ రిజర్వాయర్ వంటి ముఖ్యమైన ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రాజెక్ట్‌ల నిధులకు సంబంధించి ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ చేసిన ప్రతిపాదనపై సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ ఏడాదిలో ప్రాజెక్టులన్నీ చేపడతామని ప్రకటించారు.

### సంతోషతీరానికి మత్స్యకారులు..

వాకాడు మండలం పూడిరాయి దొరువు వద్ద సముద్రం, పులికాట్ కలిసే చోట మోడర్న్ ఇంటిగ్రేటెడ్ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ (చేపల రేవు) నిర్మాణానికి ప్రభుత్వం రూ.23 కోట్లు కేటాయించింది. మత్స్యకారులకు కొండంత అండగా నిలిచే ఈ సెంటర్ పనులు ఏపీ మ్యారిటైమ్ బోర్డు ద్వారా ఈ ఏడాది చేపట్టేందుకు సీఎం శ్రద్ధ తీసుకుంటున్నారు.

### గతుకులు పూడిన రోడ్లు



తొండవాడ హౌసింగ్ కాలనీలో సీసీ రోడ్డు

పల్లె పండుగలో భాగంగా జిల్లా రహదారి కష్టాలు తీరుతున్నాయి. సీసీ, తారు రోడ్ల నిర్మాణాలకు రూ.100.15కోట్లు కేటాయించింది. చాలాచోట్ల రోడ్ల పనులు పూర్తయ్యాయి. అలాగే డ్రెయిన్ల మరమ్మతులకు రూ.27.26కోట్లు మంజూరు చేసింది. 1,358 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.29.354 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే గతుకుల ఇక్కట్లు తప్పాయి.

### శ్రీసిటీ.. ఇక మరింత విస్తరణ

శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో కొత్త పరిశ్రమల సంఖ్య మరింత పెరగనుంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం అదనంగా 2,500 ఎకరాలు కేటాయించాలని ఆదేశించింది. ఇందుకోసం ఇప్పటికే 1753 ఎకరాల ప్రైవేటు భూమి, 830 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించింది. భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ఏడాదిలోనే భూములను శ్రీసిటీకి అప్పగించనుంది.

### ఉపాధికి బాట క్రిస్‌సిటీ

కృష్ణపట్నం పోర్టు ఆధారంగా ప్రతిపాదిత క్రిస్ సిటీకి ఈ ఏడాది జనవరి 8న ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబులు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దీంతో పారిశ్రామిక ప్రగతికి పునాదిరాయి పడింది. మూడు దశల్లో చేపట్టే క్రిస్ సిటీ పూర్తయితే రూ.37 వేల కోట్ల పెట్టుబడులొస్తాయి. 4.67 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, కోట మండలంలో తొలి దశ పనులు మొదలయ్యాయి.



### సాగరమాల.. పారిశ్రామిక వరమాల

కృష్ణపట్నం పోర్టు నుంచీ నాయుడుపేట వరకూ రూ.960 కోట్లతో నిర్మిస్తున్న ఆరు వరుసల సాగరమాల రోడ్డు ప్రాజెక్టు పారిశ్రామిక కారిడార్‌కు బాటలు వేయనుంది. నాయుడుపేటలో ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-71లను ఈ రోడ్డు కలపనుంది. గూడూరు నుంచీ పోర్టును కలుపుతూ రూ.300 కోట్లతో రైల్వే లైన్, దుగరాజపట్నం పోర్ట్‌ను కలుపుతూ రూ.761.37 కోట్లతో రైల్వే లైన్ దీనికి అనుసంధానం కానున్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే రెండు గ్రీన్‌ఫీల్డ్ ఎలక్ట్రానిక్స్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను కృష్ణపట్నం పోర్టును కనెక్ట్ చేస్తుంది.

### నాణ్యతగా శ్రీవారి ప్రసాదాలు



తిరుమల శ్రీవారి ప్రసాద నాణ్యతపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. నాణ్యమైన నెయ్యి, ఇతర దినుసులు వాడుతుండటంతో ప్రసాదాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని వీఐపీ దర్శనాలపై పరిమితి విధించింది. అలిపిరి వద్ద మూడు ప్రైవేటు హోటళ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేసి తిరుమల పవిత్రతను చాటుకుంది.

### పూర్తయిన తిరుపతి-నాయుడుపేట రోడ్డు నిర్మాణం

పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి విస్తరణ పనులు ఈ ఏడాది ముగియనున్నాయి. చంద్రగిరి నుంచీ తిరుపతి మీదుగా రేణిగుంట వరకూ ఈ ఆరులేన్ల రోడ్డు పెండింగ్‌ఉంది. రేణిగుంట నుంచీ నాయుడుపేట వరకూ రోడ్డు విస్తరణ పూర్తయింది. దీంతో తిరుపతినుంచీ నాయుడుపేటకు ప్రయాణ వ్యవధి మాత్రమే కాదు ప్రమాదాలూ తగ్గిపోవడంతో ప్రజలు సంతోషిస్తున్నారు.



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్: 6:27 (ఆదివారం సాయంత్రం) సహర్: 4:50 (సోమవారం ఉదయం)

## రేపు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారమూ కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ఈ సోమవారం రంజాన్ పండుగ కారణంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సెలవు దినం కారణంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని, ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి అర్జీలతో రావద్దని కోరారు.

## నేడు, రేపు రిజిస్ట్రేషన్, జీఎస్టీ కార్యాలయాలు పనిచేస్తాయి

తిరుపతి, మార్చి29(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్-స్టాంపుల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలు ఈనెల 30, 31 తేదీలలో పనిచేస్తాయని సంబంధిత శాఖల అధికారులు శ్రీరామ్ కుమార్, జాన్‌స్టీవెన్‌సన్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వచ్చేనెల 2నుంచి తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ నిమిత్తం స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేశామని శ్రీరామ్‌కుమార్ తెలిపారు. కాగా ఆర్థిక సంవత్సరం ముగింపు దృష్ట్యా జీఎస్టీ రిటర్న్‌ దాఖలు చేయాల్సిన వారు రెండు రోజులు వినియోగించుకోగలరని జీఎస్టీ జేసీ జాన్‌స్టీవెన్‌సన్ పేర్కొన్నారు.

# రూ.161 కోట్లతో తుడా వార్షిక బడ్జెట్

- 2023-24 జమా ఖర్చులు అకౌంటెంట్ జనరల్ చేత ఆడిట్ చేయాలి
- విలీన ప్రాంతాల మాస్టర్ ప్లాన్ తయారీకి టెండర్
- తుడా పాలకమండలి సమావేశంలో నిర్ణయం

తిరుపతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రూ.161 కోట్లకు ఆమోదం తెలిపారు. తుడా కార్యాలయంలో శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్ అధ్యక్షతన, వీసీ మౌర్య, ఎంఏయూడీ ఓఎస్డీ వెంకటసుబ్బయ్య, ఆర్డీ శ్రీనివాసులు సమక్షంలో తొలి బోర్డు సమావేశం నిర్వహించారు. తుడా ఆధ్వర్యంలో చేపట్టే పలు అభివృద్ధి పనులు, గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. 2023-24ఆర్థిక సంవత్సరం ఖాతా నివేదికలను రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌తో ఆడిట్ చేయాలని, రేణిగుంట మండలం సూరప్పకశంలో గల 145 ఎకరాల పద్మావతి నగర్ లేఔట్‌లో సీసీ డ్రెయిన్స్ నిర్మాణానికి, విద్యుదీకరణ పనులు చేయడానికి, మహిళా యూనివర్సిటీలో విద్యార్థుల సౌకర్యార్థం రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. తుడా టవర్స్ నివాసయోగ్యమైన 2, 3, 4 బెడ్ రూమ్ ప్లాట్ల విక్రయాలపై ఆరా తీశారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో వాణిజ్య గదులను, 2, 3, 4 ఫ్లోర్లలో కార్యాలయ గదులను విక్రయం లేదా అవసరమైతే లీజుకు కూడా ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. నెల్లూరు-తడ, తడ-శ్రీకాళహస్తి, పుత్తూరు-కడూరు వరకు ఉన్న మూడు ప్రధాన రహదారులకు రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్లను, కన్సల్టెన్సీ ద్వారా చేయటానికి, తుడాలో విలీనమైన ప్రాంతాల మాస్టర్ ప్లాన్ తయారీపై టెండర్లను ఆహ్వానించేందుకు, ఎస్వీయూ పరిధిలో ఆమోదించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్లను తొలగించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. చంద్రగిరి నియోజకవర్గం మామండూరు వద్ద ఎంఐజీ లేఔట్‌ను అభివృద్ధి చేయడంలో సవరణ లేఔట్ ప్లాన్‌ను డీటీసీపీ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించారు. రుయాస్పత్రిలో రోడ్లు అభివృద్ధి చేసేందుకు ఆమోదం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల కేటాయింపులో నియమ నిబంధనలు పాటించాలన్నారు. తుడా వీసీ మౌర్య మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేపట్టేందుకు బడ్జెట్లో ప్రతిపాదనలు చేసినట్టు చెప్పారు.ఈ సమావేశంలో తుడా ఇన్‌చార్జి సెక్రటరీ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, పీవో దేవికుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన కమిషనర్ మౌర్య

## తిరుపతి జిల్లాకు పురస్కారాల పంట

ఈ ఉగాదికి తిరుపతి జిల్లాకు పురస్కారాల పంట పండింది. సాహిత్య, కళా రంగాల్లో విశిష్ట సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కళారత్న హంస పురస్కారాలు జిల్లాలో ఏడుగురిని వరించాయి. సాహిత్యంలో వి.ఆర్.రాసాని, ఆముదాల మురళి, కంపల్లె రవిచంద్రన్‌లకు ప్రకటించగా, సంగీతంలో ద్వారం లక్ష్మి, సాదుల మునిరత్నంలు కళారత్నలు అందుకోబోతున్నారు. సామాజిక సేవా రంగంలో కిరణ్‌కాంత్ చౌదరికి కళారత్న ప్రకటించారు. నృత్య కళాకారులు ఎస్.ఉషారాణి కూడా ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఇక ఆకుల మల్లేశ్వరరావు(సాహిత్యం), ముని మల్లికార్జున(సంగీతం), శ్రీవాణి ఎల్లా(సంగీతం), టి.పురుషోత్తం నాయుడు(జర్నలిజం)లు ఉగాది పురస్కారాలు అందుకుంటున్నారు.

- వివరాలు 8లో -



# జిల్లాలో ఎనిమిది రోడ్ల అభివృద్ధికి రూ.20.30 కోట్లు

**- ఎమ్మెల్యేల అభ్యర్థనపై నిధుల విడుదల -**

తిరుపతి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎనిమిది ప్రధాన రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20.30 కోట్లు కేటాయించింది. అధ్వానంగా ఉన్న ముఖ్యమైన రోడ్లను తక్షణం అభివృద్ధి పరచాల్సిన అవసరముందంటూ ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చేసిన అభ్యర్థనకు స్పందించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రోడ్ల అభివృద్ధికి సంబంధించి 86 పనులకు రూ. 200 కోట్లు, స్టేట్ హైవే రోడ్ల అభివృద్ధికి సంబంధించి 139 పనులకు రూ.400 కోట్లు చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించింది. అందులో జిల్లాకు సంబంధించి చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాలకు చెందిన ఎనిమిది రోడ్ల అభివృద్ధి పనులు ఉన్నాయి. జిల్లా మేజర్ రోడ్లకు సంబంధించి చంద్రగిరి నియోజకవర్గం పెద్దమల్లెల- ఎర్రావారిపాలెం మార్గంలో 7 కిలోమీటర్ల మేరకు, అలాగే ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద నుంచీ ఉస్తికాయల పెంట మీదుగా పించా రోడ్డు వరకూ 7 కిలోమీటర్ల మేరకు మొత్తం 14.93 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.3.80 కోట్లు కేటాయించారు. రాష్ట్ర హైవేలకు సంబంధించి గూడూరు - దుగరాజపట్నం రోడ్డు నుంచీ నిడిగుర్తి రోడ్డు వరకూ 7.60 కిలోమీటర్లు అభివృద్ధి చేయడానికి రూ.3 కోట్లు కేటాయించారు. గూడూరులో మద్రాసు - కోల్‌కతా రోడ్డు నుంచీ బంగాళాఖాతం రోడ్డు వరకూ 3.20 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.1.80 కోట్లు కేటాయించారు. సూళ్లూరుపేటలో ఎంసీ రోడ్డు నుంచీ బే ఆఫ్ బెంగాల్ రోడ్డు వరకూ, అలాగే ఓజిలి - గొల్లపల్లి రోడ్డు వరకూ మొత్తం 8.60 కిలోమీటర్ల అభివృద్ధికి రూ.3.20 కోట్లు కేటాయించారు. భాకరాపేట నుంచీ తలకోన నడుమ 23.60 కిలోమీటర్ల రోడ్డును మెరుగుపరిచేందుకు రూ.6 కోట్లు కేటాయించారు. శ్రీకాళహస్తి-మద్దికండ్రిగ రోడ్డులో 3 కిలోమీటర్ల రోడ్డును బాగుచేయడానికి రూ.2.50 కోట్లు కేటాయించారు. ఈ ఎనిమిది పనుల కింద మొత్తం 61 కిలోమీటర్ల మేర ఎనిమిది రోడ్ల అభివృద్ధి పనులకు గానూ రూ.20.30 కోట్లు కేటాయిస్తూ ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

## నారావారిపల్లెలో రూఫ్‌టాప్ పనులు పూర్తి

- డిస్కం సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 29(ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె గ్రామంలో వందశాతం రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ పనులు పూర్తయ్యాయని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు వెల్లడించారు. చిన్నరామాపురం, రంగంపేట, కందులవారిపల్లి పంచాయతీల్లో 2వేల సోలార్ రూఫ్‌టాప్ సర్వీసులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 70శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను పది రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. నారావారిపల్లెలో జరుగుతున్న సోలార్ విద్యుత్ రూఫ్‌టాప్ సిస్టమ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. సదరన్ డిస్కం పరిధిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నారావారిపల్లిలో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద విద్యుత్ లైన్ల ఏర్పాట్లు, ఇండోర్ సబ్‌స్టేషన్ పనులను కూడా త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్రనాయుడు, ఈఈ చిన్నరెడ్డప్ప, నిర్మాణాల విభాగం ఈఈ పి.బాలాజీ, ఈఈ టెక్నికల్ వాసవీలత పాల్గొన్నారు.



నారావారిపల్లిలో సోలార్ విద్యుత్ పనులను పరిశీలిస్తున్న సంతోషరావు

# భక్తి ముందు ఎండ ఓడిపోయింది!





ఎండ భగభగా మండుతోంది. చెమటలు కారిపోతున్నాయి. అప్పుడే దర్శనం చేసుకుని బయటకు వచ్చారు బెంగళూరుకు చెందిన ఒక కుటుంబం. వీల్‌చైర్‌కే పరిమితమైన తల్లి. కూడదీసుకుంటూ నడుస్తున్న తండ్రి. ఇద్దరినీ గుడి ఎదురుగా జర్మన్ షెడ్ నీడలో ఉంచి, ఆ కొడుకూ కోడలూ లడ్డూల కోసం వెళ్లారు. తదేకంగా గోపురాన్నే చూస్తున్న ఆమె, భర్తను ఒక కోరిక కోరింది. 'మళ్లీ తిరిగి వస్తామో.. లేదో.. ఇంకొక్కసారి ఆ సామికి దణ్ణం పెట్టుకోవాలని ఉందయ్యా' అని. అతను తలెత్తి ఒక్క క్షణం నిప్పులు కురుస్తున్న ఆకాశంకేసి చూశాడు. ఆ వెంటనే, 'పద వెళ్దాం' అన్నాడు. వీల్ చైర్‌ను తోసుకుంటూ గోపురం వైపు కదిలాడు. పైన ఎండ.. పాదాలు మాడిపోతున్నాయి. అలిసిపోతూ, ఆగుతూ.. మునివేళ్ల మీద నడుస్తూ వీల్‌చైర్‌ను గొల్ల మండపం దగ్గరకు తీసుకువెళ్లాడు. అక్కడ గుడికి అభిముఖంగా ఇద్దరూ నేల మీద సాష్టంగపడి దణ్ణం పెట్టుకున్నారు. తడి కళ్లతో ఆమె భర్తను చూసింది. అతను సంతృప్తిగా నవ్వాడు. 90లకు దగ్గరవుతున్న వయసు వారిది. 58 ఏళ్ల దాంపత్య బంధం బలం అది. వారి భక్తి ముందు సూర్యుడు కూడా తల వంచాడు కదా అని ఆ వృద్ధ జంటను చూసిన వారు అనుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి






మోషేన్‌రాజు - తరుణ్‌భాస్కర్, ఈషా రెబ్బా

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, సినీ దర్శకుడు తరుణ్‌భాస్కర్, హీరోయిన్ ఈషా రెబ్బా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,569**

**తలనీలాలు సమర్పించినవారు: 21,780**



# జిల్లాకు ఉగాది పురస్కారాల పంట

**రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య, కళా రంగ ప్రముఖులకు శనివారం ప్రకటించిన కళారత్న (హంస), ఉగాది పురస్కారాలు జిల్లాలో 11 మందిని వరించాయి. ఆదివారం విజయవాడలో నిర్వహించే ఉగాది కార్యక్రమంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వీరు పురస్కారాలను అందుకోబోతున్నారు. కళా రత్న పురస్కార గ్రహీతలకు రూ.50 వేల నగదుతోపాటూ హంస ప్రతిమ అందజేస్తారు. ఉగాది పురస్కార గ్రహీతలకు రూ.10వేల నగదు, సర్టిఫికెట్‌తో సత్కరిస్తారు.**

**- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి**

### ఆముదాల మురళి



తవణంపల్లె మండలం అత్తిమాకులపల్లెలో 1975లో పుట్టారు. కర్నాటకలోని ముక్త విశ్వవిద్యాలయం నుంచీ సంస్కృతంలో పీజీ పూర్తి చేశారు. 200 అష్టావధానాలు, 3 శతావధానాలు చేశారు. అవధాన కళానిధి, అవధాన శేఖర, అవధాన రత్నాకర బిరుదులు పొందారు. సుమారు 15 పుస్తకాలు రాశారు.

### డాక్టర్ వీఆర్ రాసాని



ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు అధ్యాపకుడిగా పదవీ విరమణ పొందారు. కథ, నవల, నాటక రచయితగా ప్రసిద్ధులు. 1957లో పులిచెర్ల మండలం కురవపల్లెలో పుట్టారు. మెరవణి, పయనం, మావూరి కథలు, మహాన్నభావుడు మా నామాల సాయిబు వంటి కథా సంపుటాలు ప్రచురించారు. చీకటిరాజ్యం, పరస, స్వప్నజీవి, ఆదియోధుడు, ఏడోగ్రహం, వలస, ముద్ర, చీకటిముడులు, బతుకాట నవలలు రాశారు.

### కంపల్లె రవిచంద్రన్



టీటీడీ సప్తగిరి మాసపత్రిలో ఉపసంపాదకుడిగా పనిచేస్తున్నారు. సినిమా రంగానికి సంబంధించి అనేక పుస్తకాలు రాశారు. కాశీఖండానికి సరళవచనం, మహాభారతోపన్యాసాలు (వ్యాససంపుటి), అంతా రామమయం సహృదయ రవిచంద్రిక, తిరుప్పావై - తిరువెంబావై వ్యాఖ్య, శ్రీకృష్ణశ్శరణం మమ, వల్లభాచార్య రచన సుమధురకు వ్యాఖ్య, వంగిపూడి పద్య కావ్యానికి గో కలాపం పేరుతో వ్యాఖ్య, సంకుసాల నృశింహ కవి కవికర్ణరయాసయానికి వ్యాఖ్య రాశారు.

### డాక్టర్ ఎస్.ఉషారాణి

ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో కూచిపూడి అధ్యాపకురాలిగా ఉన్నారు. యక్షగానంపై ప్రొఫెసర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి పర్యవేక్షణలో 2004లో పరిశోధన చేశారు. దూరదర్శన్ ఏ-గ్రేడ్ ఆర్టిస్టుగా ఉన్నారు. ఎస్వీబీసీ ఛానల్‌లో అనేక కార్యక్రమాలకు కొరియోగ్రఫీ చేశారు. భగవద్గీత - నృత్య రీతి పుస్తకాన్ని రాశారు.



**ద్వారం లక్ష్మి** శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయ సంగీత, నృత్య విభాగంలో అధ్యాపకులుగా ఉన్నారు. కర్ణాటక, లలిత సంగీత, హిందూస్థానా భజన్స్ గానం చేయడంలో మేటి. పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు మనుమరాలు ఈమె. సంగీత విద్యను పద్మవిభూషణ్ ఎంఎల్ వసంతకుమారి, పెమ్మరాజు సూర్యారావు వద్ద నేర్చుకున్నారు. దేశ, విదేశాల్లో నాలుగు వేలకు పైగా సంగీత కచేరీలు చేశారు.



**కిరణ్‌క్రాంత్ చౌదరి** శిల్ప కళపై డీ.లిట్ డిగ్రీ పూర్తి చేశారు. ఎస్వీయూ ఆర్కియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఫ్యాకల్టీ డీన్‌గా, యూజీసీ ఎమిరటస్ ప్రొఫెసర్‌గా చేశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో కళా సంబంధమైన అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఇప్పటి వరకూ 18 పుస్తకాలు రాశారు. 9 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 120 వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.



**సాధుల మునిరత్నం** సంగీత కుటుంబ నేపథ్యం నుంచీ వచ్చారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో సంగీత రంగంలో డిప్లొమో చేశారు. 1993లో టీటీడీలో చేరి 30 ఏళ్లకు పైగా నాదస్వర విద్వాంసులుగా పనిచేశారు. నేషనల్ ఏ-గ్రేడ్ కళాకారులుగా గుర్తింపు పొందారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా సృష్టించారు.



### ప్రతిభకు పట్టం.. ఉగాది పురస్కారాలు



**ఆకుల మల్లేశ్వరరావు:** ఐబీఎస్ (ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ సర్వీస్)లో స్టేషన్ డైరెక్టర్ (ఏఐఆర్)లో పనిచేశారు. హిందీలో ఎంఏ, సంస్కృత ఆంగ్ల యోగాలో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. హిందీ, తెలుగులో ఏడు పుస్తకాలను రచించారు.



**ముని మల్లికార్జున:** కర్ణాటిక్ మ్యూజిక్ డోలులో సర్టిఫికెట్ కోర్సు, శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ డోలు పూర్తి చేసి శ్రీకాళహస్తి ఆలయంలో భజంత్రిగా ఉన్నారు. ఆలిండియా రేడియో బి గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు.



**శ్రీవాణి ఎల్లా:** టీటీడీ ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో వీణ విభాగాధిపతి. ఆలిండియా రేడియో ఏ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు.



**టి.పురుషోత్తమ నాయుడు.:** ఎస్వీబీసీలో ఆధ్యాత్మిక విశేషాల విభాగంలో సీనియర్ ఏవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆలయాలపై వెయ్యికి పైగా కథనాలు రూపొందించి ప్రసారం చేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎంసీజే (జర్నలిజం)చేశారు. పీహెచ్‌డీని సైతం పూర్తి చేశారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

## నేటి నుంచి రెండు ప్యాసింజర్ రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

తిరుపతి(సెంట్రల్), మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-కదిరి దేవరపల్లి, తిరుపతి-గుంతకల్ మధ్య గతంలో రాకపోకలు సాగిస్తున్న రెండు ప్యాసింజర్ రైళ్లను ఆదివారం నుంచి యథావిధిగా పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పాకాల, పీలేరు, ధర్మవరం, అనంతపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

## అమ్మను కొట్టాడని..అన్నను చంపాడు



వెంకటరమణయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాజీ

- కాపులూరులో ఘటన

నాయుడుపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అమ్మను కొట్టాడన్న కోపంతో తమ్ముడు అన్న ప్రాణం తీసిన ఘటన నాయుడుపేట మండలం కాపులూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు చెప్పిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సరోజనమ్మకు వెంకటరమణయ్య(50), బాబు కుమారులు. వెంకటరమణయ్య గ్రామంలోనే గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాబు గూడూరులో కాపురముంటూ రోజూ గ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుని వెళుతుంటాడు. శుక్రవారం అర్థరాత్రి మద్యం తాగి వచ్చిన వెంకటరమణయ్య భార్య మణెమ్మను కొడుతుండగా తల్లి సరోజనమ్మ అడ్డు వచ్చింది. దీంతో తల్లిని కూడా కొట్టాడు. అదే సమయంలో అక్కడున్న బాబు 'అమ్మను ఎందుకు కొడతావ్' అని నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆవేశానికి గురైన వెంకటరమణయ్య మచ్చుకత్తితో బాబుపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. కత్తిని లాక్కున్న బాబు అన్న మెడపై వేటువేశాడు. వెంకటరమణయ్య అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ చెంచుబాబు, అర్బన్ సీఐ బాబి అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## ఆగమోక్తంగా శనీశ్వరస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. శనిగ్రహం కుంభరాశి నుంచి మీన రాశిలోకి ప్రవేశించడంతోపాటు ఉత్తరాభాద్ర నక్షత్రంతో కూడిన శనివారం, అమావాస్య కావడంతో స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## గుట్టు వీడని విద్యార్థిని స్నేహ కేసు..!

తిరుపతి(నేరవిభాగం), మార్చి 29(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని స్నేహ కేసు గుట్టు వీడడంలేదు. ఈ విద్యార్థిని రెండవ అంతస్తు నుంచి కింద పడింది. ఈ ఘటనలో అమ్మాయి తలకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు పేర్కొంటున్నారు. మిద్దెపై నుంచి ఆమే పడి వుంటే కచ్చితంగా తలకు బలమైన గాయాలు అయ్యేవని డాక్టర్లు అంటున్నారు. సహచర విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ కారణంగానే స్నేహను కొట్టి కింద పడేసి ఉంటారనే అందువల్లే కాళ్లకు, పొట్టభాగంలో ఘాయాలయ్యాయని అనుమానాలు ఉన్నాయి. పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడంలో ఆలస్యమవుతోందని పోలీసులు చెబు తున్నారు. పాఠశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న స్నేహ చిన్నాన్నతో పాటు సిబ్బందిని, సహచర విద్యార్థులను, చికిత్స పొందుతున్న స్నేహను ఎస్ఐ గిరిబాబు విచారించి స్టేట్‌మెంటు రికార్డు చేశారు. అయితే ఆ వివరాలు బయటకు పొక్కడంలేదు. అయితే బాధ్యులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామని ఈస్ట్ పోలీసులు అంటున్నారు.

# సాహిత్య, కళాస్రష్టలకు శ్రీవాణి ఉగాది పురస్కారాలు



శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి నుంచి పురస్కారాలు అందుకుంటున్న నరాల రామారెడ్డి, ఎస్వీ.రామారావు, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, రాణీ నాగశ్రీ శైలేశ్వరి, ప్రాస మణి

శ్రీసిటీ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరచిన ప్రముఖులకు శ్రీసిటీలోని ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఐదుగురికి ఉగాది పురస్కారాలు అందజేశారు. తెలుగు సాహిత్యం, అవధాన కళలలో డాక్టర్ నరాల రామారెడ్డి (ప్రొద్దుటూరు) సేవలను ప్రశంసిస్తూ ఆయనను సత్కరించారు. ఆలయ పునర్నిర్మాణం, చారిత్రక పరిశోధనల్లో విశేష కృషి చేసిన శిల్పకళా, పురావస్తు పరిశోధకులు, చరిత్రకారుడు స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డిని ఉగాది పురస్కారంతో సత్కరించారు. తెలుగు సినిమా వికాసానికి ఎస్వీ రామారావు చేసిన సేవలను అభినందిస్తూ శ్రీవాణి పురస్కారాన్ని అందజేశారు. ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, రేడియో ఏ గ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు కలిగిన పద్మావతి మహిళా యూనివర్సిటీ సంగీత శాఖాధ్యక్షురాలు డాక్టర్ రాణీ నాగశ్రీ శైలేశ్వరి శాస్త్రీయ సంగీత సంప్రదాయానికి చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు అందుకున్నారు. హాస్యభరిత, లయబద్ధ ప్రసంగాల దిట్ట, ప్రాసమణిగా పేరుగాంచిన అన్నదాత సుబ్రమణ్యేశ్వరరావు తన ప్రాస ప్రసంగంతో సభికులను ఆకట్టుకున్నారు. పురస్కార గ్రహీతల ప్రతిభా పాటవాలను రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసించారు. ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలలో శ్రీవాణి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను కోట రాజశేఖర్, ఆర్ఎం భాస్కర్, డాక్టర్ కే జగ్గారావు, డీ.యూన్సీ బైరి పార్థసారథి పరిచయం చేశారు. వ్యాఖ్యాతగా పల్లేటి బాలాజీ వ్యవహరించారు.

# కాటేసిన కునుకు



కావడి శ్రీనివాసరెడ్డి (పాతచిత్రం)

- డివైడర్‌ను ఢీకొన్న కారు
- ఒకరి మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వారు నలుగురు మంచి స్నేహితులు. ఏటా ఉగాది రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. అదే ప్రకారం హైదరాబాద్ నుంచి కారులో తిరుమలకు పయనమయ్యారు. మార్గమధ్యంలో కునుకుపాటు వారిని కాటేసింది. కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా.. ముగ్గురు తీవ్రగాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటన శనివారం ఉదయం తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. హైదరాబాద్ సమీపంలోని అబ్దుల్లాపూర్ పంచాయతీకి చెందిన కావడి శ్రీనివాసులురెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. అదే పంచాయతీకి చెందిన మల్లారెడ్డి(55) పోస్టుమ్యాన్‌గా, భరత్‌కుమార్(45), బాల్‌రెడ్డి(45)లు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఈ నలుగురు శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి తిరుమలకు కారులో బయలుదేరారు. శనివారం ఉదయం కారు అదుపు తప్పడంతో బసవయ్యపాళెం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న శ్రీనివాసులరెడ్డి వాహనంలోనే ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న ముగ్గురు స్నేహితులు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణ శివారులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసులరెడ్డి మృతదేహాన్ని వెలుపలకు తీసి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



తీవ్రంగా గాయపడిన బాలిరెడ్డి - ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## తెలుగుజాతి గర్వించదగ్గ పార్టీ తెలుగుదేశం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో నరసింహయాదవ్, శాప్ చైర్మన్

తిరుపతి(జీవకోన), మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి గర్వించదగ్గ ఏకైక పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ పార్లమెంటు అధ్యక్షులు, యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. టీడీపీ ఆవిర్భావ వేడుకలను నగర పరిధిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద పెద్దఎత్తున నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎన్నో పథకాలను ప్రవేవపెట్టిన మహనీయుడని కొనియాడారు. నందమూరి తారక రామారావు ఆశయాలను చంద్రబాబు, నారా లోకేశ్ కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, ప్రణీత్, మహేష్‌యాదవ్, కుమారమ్మ, వెంకటరత్నం, సింగంశెట్టి సుబ్బరామయ్య, సుబ్బుయాదవ్, బీజీ కృష్ణయాదవ్, హేమంత్ రాయల్, గోళ్ల మధుసూదన్‌నాయుడు, సుధాకర్, అంబూరు సింధూజ, నరేష్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ధోని లోకయాదవ్, వెంకటాద్రియాదవ్, బాల, అయ్యప్ప, దొరైరాజు, శ్రీనివాస్‌యాదవ్, అక్కినపల్లి లక్ష్మయ్య, చందు చౌదరి పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు భేష్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు భేష్‌గా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఉపాధిహామీ పథకం 2024-25 అమలుతో జిల్లాలో సాధించిన ప్రగతి, ప్రణాళికలపై కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది జిల్లాలో రూ.1.72లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించామన్నారు. ఈ పథకంలో అన్ని రకాల పనులకు గాను కూలీలకు రూ.260కోట్లు వేతనాల రూపంలో చెల్లించామన్నారు. 4,853 చెరువుల్లో పూడికతీత, పునరుద్ధరణ పనులుచేపట్టి 450కోట్ల లీటర్ల నీటిని భూమిలోకి ఇంకింపజేశామన్నారు. సన్నకారు, చిన్నకారు రైతుల పొలాల్లో 1,064 పంటకుంటలు, 803 పొలాల్లో కందకాలు, 1,920 కిలోమీటర్ల పంటకాలువ పూడికతీత పనులు జరిగాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కల పెంపకం, 1,211 ఎకరాల పండ్లతోటల పెంపకం చేపట్టినట్లు వివరించారు. రూ.20కోట్లతో చిన్నకారు రైతుల పశువులకు షెడ్లు నిర్మించామన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తారు, మెటల్ రోడ్లు వేశామన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

## నకిలీ పట్టాల బాగోతంపై చర్యలు తీసుకోండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం-

రేణిగుంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఇంటి పట్టాలను నకిలీ చేసి విక్రయించిన అప్పటి రెవెన్యూ అధికారి, ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన బుజ్జమ్మ 2022లో రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోవడంతో బాధితురాలు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు అప్పటి రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఈ నెల 7వ తేదీన ఆదేశాలు జారీ చేయగా, శనివారం వాట్సాప్ గ్రూపులో హైకోర్టు ప్రొసీడింగ్స్, పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ హల్‌చల్ చేశాయి.

## సీబీఎస్‌లో ఉగాది రద్దీ



తిరుపతి(ఆర్టీసీ), మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పర్వదినాల సెలవులతో పాటు వారాంతం కలసిరావడంతో ఒక్కసారిగా సెంట్రల్ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గ్రామాలకు వెళ్లేవారు, అక్కడి నుంచి నగరానికి వచ్చేవారితో అన్ని ప్లాట్‌ఫామ్స్ కళకళలాడాయి. ముఖ్యంగా పల్లెవెలుగు బస్టాండులో మరింత ఎక్కువ రద్దీ కనిపించింది. ఏడుకొండల బస్టాండు శ్రీవారి భక్తులతో కిటకిటలాడింది. రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో నిరీక్షణ తప్పలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీట్ల కోసం పాట్లు పడ్డారు. ఆర్టీసీ వారు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసి ఉంటే బావుండేదని ప్రయాణికులు చర్చించుకోవడం వినిపించింది.



## బాలాంజనేయస్వామి ఆలయంలో నేటినుంచి శ్రీరామనవమి వసంతోత్సవాలు

సూళ్లూరుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం చైత్ర శుద్ధ పాడ్యమి ఆదివారం నుంచి ఏప్రిల్ 8 చైత్ర శుద్ధ ఏకాదశి వరకు శ్రీరామనవమి వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామివారి ఒక్కొక్క రోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొలిరోజు ఆదివారం 30న వైకుంఠవాస అవతారం, 31న వామన అవతారం, 1న త్రివిక్రమ అవతారం, 2న బలరామ, 3న రామావతారం, 4న విశ్వామిత్ర యాగ సంరక్షణ అవతారం 5న కృష్ణావతారం, 6న సీతారామ కల్యాణం, 7న స్వామివారి గ్రామోత్సవం, 8న ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.









## నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నాయుడుపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఈనెల 30, 31 తేదీల్లో పనిచేస్తాయని ఈఈ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ సందర్భంగా సెలవు అయినప్పటికి వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయన్నారు.

## నేడు చెంగాళమ్మ ఆలయంలో ఉగాది వేడుకలు

సూళ్లూరుపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహిస్తారు. ఉదయం 10గంటలకు కలశస్థాపన, 10:30కు లక్షకుంకుమార్చన జరుగుతుంది.

## లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కలవకొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామికి శనివారం ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రి స్వామి, అమ్మవార్ల పల్లకీసేవ జరిపి జరిపారు.

## ఉపాధి పనుల్లో అక్రమాలను సహించం: డ్వామా పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్

పెళ్లకూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడుతూ దుర్వినియోగం చేస్తే సహించబోమని డ్వామా పీడీ సీవీ శ్రీనివాస్‌ప్రసాద్ హెచ్చరించారు. పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు చేపట్టిన 637 పనుల్లో అవకతవకలను గుర్తించి వెల్లడించారు. అవకతవకలకు పాల్పడిన సిబ్బందిని పీడీ మందలించారు. నిధులు దుర్వినియోగం చేసిన వారి నుంచి రూ.3,75,359 రికవరీ చేయనున్నట్లు వెల్లడించారు. తాళ్వాయిపాడు, నెలబల్లి, శిరసనంబేడు ఎఫ్‌ఏలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, ఏపీడీ ప్రేమ్‌కుమార్, ఏపీవో దయానందం తదితరులు పాల్గొన్నారు.



## పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: కురుగొండ్ల



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ఆవిర్భవించిందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 6వ వార్డు ఎన్‌ఆర్ కాలనీలో టీడీపీ జెండాను కురుగొండ్ల ఎగరవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవం కాపాడడంతో పాటు ప్రతి పేదవాడికీ కూడు, గూడు, గుడ్డ అందించాలన్న ధ్యేయంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చుతున్నారని కొనియాడారు. కార్యక్రయంలో మార్కెట్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధరం, ఎంపీపీ తునూజారెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం: పాశిం

గూడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీని ఎన్టీఆర్ స్థాపించారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పింది టీడీపీయేనన్నారు. ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చుతూ పార్టీని ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, జనార్దనరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

## టీడీపీ ఆవిర్భావంతోనే రాజకీయ చైతన్యం: విజయశ్రీ



నాయుడుపేటలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల తదితరులు

నాయుడుపేట, సూళ్లూరుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావంతోనే తెలుగు ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నాయకులతో కలిసి ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరామ్ ప్రసాద్, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, మధురెడ్డి, పెనల కిషోర్‌బాబు, విజియల్ నాయుడు, పసల గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ● సూళ్లూరుపేట పట్టణంలోని రైల్వే గేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవనాయుడు, చిట్టేటి పెరుమాల్, కొక్కు శంకరయ్య, అలవల శ్రీనివాసులు, గాడి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

బాలాయపల్లి, మార్చి29(ఆంధ్రజ్యోతి) స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ గూడూరు భాస్కరరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏపీవో జ్యోతి మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు సపోటా, డ్రాగన్ ఫ్రూట్, మొక్కలు ఇవ్వడం జరుగుతుందన్నారు. పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పశువైద్యాధికారి సుధీర్ తెలిపారు. గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇళ్ల మంజూరుకు ఏడువందల దరఖాస్తులు అందాయన్నారు. అలాగే పలువురు అధికారులు తమ శాఖల్లో పనులు వివరాలు వెల్లడించారు. సమావేశంలో ఎంపీడీవో వినీల్ కుమార్, వైస్ ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించండి

వెంకటగిరి టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని ఎంపీడీవో కోటేశ్వరావు, ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించాలన్నారు. పారవోలు ఎంపీటీసీ సభ్యురాలు శ్రీదేవి గత మూడు సమావేశాలకు హాజరు కాలేదు. శనివారం నిర్వహించిన సమావేశానికి వచ్చిన ఆమెను వెళ్లిపోవాలని ఎంపీడీవో సూచించారు. దీంతో ఆమె వాగ్వాదానికి దిగారు. ఎస్‌ఐ సుబ్బారావు సర్ది చెప్పారు. ఉదయమే తాను వివరణ ఇచ్చినా సమావేశంలో పాల్గొన వద్దని చెప్పడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ జడ్పీ సీఈవో ఆదేశాలను తాము తెలియజేశామని చెప్పారు.

## గ్రీన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

కోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్న గ్రీన్ ఫౌండేషన్ సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం కోటలోని గ్రీన్ ఫౌండేషన్ కార్యాలయంలో ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్యే చేతులమీదుగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, సురేష్‌బాబు, భాస్కర్‌రెడ్డి, మధుయాదవ్, షంషుద్దీన్, సురేష్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డుకు భూమిపూజ

నాయుడుపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని వెంకటగిరి రోడ్డు నుంచి అమరా గార్డెన్ మసీదు వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే విజయశ్రీ, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లా భూమిపూజ చేశారు.

## టీఎంఆర్ పాఠశాలలో ఉగాది వేడుకలు

చిట్టమూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కొత్తగుంట టీఎంఆర్ పాఠశాలలో శనివారం ఉగాది వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థులు తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణతో హాజరయ్యారు. ఆటలు, పాటలు, కోలా టాల ప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్స్‌పాల్ రహంతుల్లా, మేనేజర్ ఆశ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

## తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

తడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో రవీంద్రబాబు ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొలవి రఘురెడ్డి అధ్యక్షతన జరిగింది. వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.50.25 లక్షలు అవసరమని నిర్ణయించి ఉన్నతాధికారులకు నివేదిక పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఏడు ప్రదేశాల్లో నూతన బోర్లు తవ్వాలని నిర్ణయించామన్నారు. సముద్రపు నాచు పెంపకానికి సంబంధించి 50 యూనిట్లు మంజూరయ్యాయని, మత్స్యకారుల మహిళలకు ఒక్కొక్క యూనిట్ రూ.11,629తో కేటాయిస్తారని మత్స్యశాఖ ఎఫ్‌డీవో మహిజ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం కింద మండలంలో 156 పనులను గుర్తించామని ఏపీవో నాగరాజు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ ఇందుమతి, ఎంపీడీవో విజయకుమార్, వైస్ ఎంపీపీ వెంకటేష్, రమేష్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

## నారాయణ కళాశాలలో ప్రాజెక్టు ఎక్స్‌పో

గూడూరు అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దత్తాత్రేయ శర్మ, అనిల్‌కుమార్, సుధీర్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

కోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని ఆశాఖ వ్యవసాయ అధికారులు అన్నారు. శనివారం కోటలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త రవిచంద్రప్రసాద్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి నిరంజన్ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని వీవోఏలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం అనీల, శ్రీనివాసులు, బాబా సాహెబ్, భాగ్యమ్మ, సీసీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## బైక్ తగిలి మొరాయించిన రైల్వేగేటు

సూళ్లూరుపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న రైల్వేగేటు తెరుస్తున్న సమయంలో మోటారు సైకిల్ తగలడంతో మొరాయించింది. దాదాపు గంటసేపు రైల్వేగేటు తెరుచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వేగేటు సిబ్బంది సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి గేటును సరిచేశారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

గూడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆదిశంకర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. శనివారం కళాశాలలో ప్రయాగ్- 2కె25 జాతీయస్థాయి టెక్నికల్ సింపోసియం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాజామురగదాస్, అమరేంద్ర, ఉమా ప్రత్యూష, రామయ్య తదితరులు పాల్గొన్నారు.











